www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
01.04.2024
సంపుటి:2 సంచిక: 171

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

# దమ్ముంటే 200 సీట్లు గెలవండి చూద్దాం

- బెంగాల్ లో సీఏఏ అమలు చేసే ప్రసక్తే లేదు
- మా రాష్ట్రంలో ఇండియా కూటమి లేదు
- కాంగ్రెస్, సీపీఎం బీజేపీతో చేతులు కలిపాయి
- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



వివరాలు 2లో

## ఎల్ కే అద్వానీకి భారతరత్న ప్రదానం..



- ఇంటికి వెళ్లి అవార్డును అందజేసిన రాష్ట్రపతి
- ద్రౌపదీ ముర్ముతో పాటు పాల్గొన్న ప్రధాని మోడీ, మాజీ ఉపరాష్ట్రపతులు, ధన్కడ్, వెంకయ్య నాయుడు
- అనారోగ్యం వల్ల ప్రదానోత్సవానికి రాని అద్వానీ

**విశాల భారతి, న్యూ ఢిల్లీ:**

బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'ను ప్రదానం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి అవార్డు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో శనివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన నివాసానికే వెళ్లి పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు కు భారతరత్నను శనివారం మరణానంతరం ప్రదానం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్ము నుంచి పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు అవార్డును స్వీకరించారు. మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడిగా పేరొందిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్, బీహార్‌మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌లకు కూడా మరణానంతరం ప్రకటించిన ఈ పురస్కారాలను వారి కుటుంబ సభ్యులు స్వీకరించారు. చరణ్‌సింగ్ తరఫున మిగతా 2లో





# కాంగ్రెస్‌ను వదిలిపెట్టం వెంటాడుతాం.. వేటాడుతాం

- ప్రశ్నించడానికే మాకు ప్రతిపక్షం ఇచ్చింది
- బీఆర్ఎస్ హయాంలో ఏనాడైనా కరెంటు పోయిందా?
- ఇప్పుడెందుకు ఇన్ని కోతలు
- కరువు మీద ఈ సర్కారుకు సోయి ఉందా?
- రైతులను ఆదుకోవాలన్న బుద్ధి ఉందా?
- మా హయాంలో ఉన్న కరెంట్ ఇప్పుడెందుకు పోయింది
- కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు
- పాలన మీద అవగాహన లేదు
- మేం వ్యవసాయ స్థిరీకరణ చేశాం
- అందుకే ఆ స్థాయిలో ధాన్యం పండింది
- సూర్యాపేటలో ఎండిన పంట పొలాలను పరిశీలించిన కేసీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో కరువు పరిస్థితులకు అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. ఇవాళ సూర్యాపేట జిల్లాలో ప్రెస్‌మీట్ నిర్వహించిన ఆయన.. ఇది వచ్చిన కరువు కాదని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. 'రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి కారణం మీరు. కరెంటు లో వోల్టేజ్ సరఫరాకు కారణం మీరు. మీకంటే ముందు ఎనిమిదేండ్లు మేం బ్రహ్మాండంగా కరెంటు ఇచ్చినం. ఎనిమిదేండ్లు ఇచ్చిన కరెంటు ఇప్పుడెట్ల మాయమైంది' అని కేసీఆర్ ప్రశ్నించారు.

'మేం పదేండ్లు రైతులను మేం బ్రహ్మాండంగా చూసుకున్నం. ఇప్పుడు వాళ్ల కండ్ల పొంటి నీళ్లు వస్తుంటే ఎట్ల చూడాలె. వాళ్లు బాధలు పడుతుంటే చూసి ఎట్ల ఊకోవాలె. ఇప్పుడే ఇట్లుంటే ముందుముందు ఎట్లుంటదని రైతులు భయాందోళన చెందుతున్నరు. అందుకే వాళ్లపక్షాన మేం నిలబడ్డం. డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తమన్నరు. డిసెంబర్ 9 పొయ్యి ఎన్నాళ్లయ్యింది..? ముఖ్యమంత్రి ఎక్కడున్నరు..? మీరు దొంగ హామీలు ఇచ్చి తప్పించుకోలేరు. మేం వెంటపడి మిగతా 2లో



# కాంగ్రెస్‌లోకి కడియం, కావ్య

- హస్తం గూటికి చేరిన తండ్రీ కూతుళ్లు
- కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ
- సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో చేరిక
- కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చే ఛాన్స్?
- నేడు ఢిల్లీలో కాంగ్రెస్ సీఈసీ భేటీ
- శ్రీహరి ఫ్యామిలీకి టికెట్ కేటాయింపుపై ఉత్కంఠ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

బీఆర్ఎస్ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ ప్రెసిడెంట్, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల కడియం కావ్యకు బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసే ఉద్దేశం లేదని ఆమె నిరాకరించిన సంగతి తెలిసిందే. మరోవైపు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఆమె తండ్రి, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కూడా త్వరలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్‌లో చేరడం బీఆర్ఎస్‌పార్టీకి పెద్ద షాక్‌అని చెప్పొచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి కీలక నేత. టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేశారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి ఆ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగానూ సేవలందించారు. కుమార్తెకు లోక్‌సభ టికెట్ ఇచ్చినా బీఆర్ఎస్‌ను వీడటం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మిగతా 2లో

## ప్రకృతి వైపరీత్యాలు ప్రభుత్వ వైఫల్యాలా?

- ప్రతిపక్షాలది నీచబుద్ధి తప్పా.. అర్థం ఉందా?
- పక్క రాష్ట్రాలకు నీళ్లను వదిలి చుక్క లేకుండా చేసిందెవరు?
- పదేండ్లలో చేసిన పాపాలన్నీ వంద రోజుల పాలనకు రుద్దుతున్నరు
- గత ప్రభుత్వ వైఫల్యాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫైర్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

'ప్రకృతి వైపరీత్యాలని, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చూపాలనీ ప్రయత్నించే నీచమైన ప్రవృత్తి గల ప్రతిపక్ష నాయకులారా' అంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అందులో.. ''ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది డిసెంబర్ 7, 2023. అంటే వర్షాకాలం అయిపోయిన తరువాత. అప్పటికే నాగార్జునసాగర్ లో నీళ్లు లేని కారణంగా మొదటిపంటకే నీళ్లివ్వని మీరు, రెండో పంటకి నీళ్లివ్వాలని హేతుబద్ధత లేని డిమాండ్లు చేయడం మీ దుర్బుద్ధికి తార్కాణం కాదా? ఆ పాపాన్ని ఈ



100 రోజుల ప్రభుత్వానికి రుద్దాలనుకోవడం మీ నీచమైన బుద్ధికాక ఇంకేమనుకోవాలి? అనుమతులు లేకుండా, అధికారులు చెప్తున్నా.. వినకుండా, పక్క రాష్ట్రాలు నీటిని తరలిస్తున్నా, కళ్లు మూసుకొని , రిజర్వాయర్లు మిగతా 2లో





# ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ట్యాపింగ్!

- తిరుపతన్న, భుజంగరావు వెల్లడి
- డబ్బు రవాణాకు ఎస్కార్ట్, టాస్క్‌ఫోర్స్ సాయం
- న్యాయ సలహాలు తీసుకుంటున్న దర్యాప్తు ఆఫీసర్లు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ స్పీడప్

మిగతా 2లో

## తెలంగాణలో ఎంపీ సీట్లకు.. కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ ఉత్తర్వులు జారీ చేశారు.

1. ఖమ్మం -పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
2. నల్గొండ - ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
3. కరీంనగర్ - పొన్నం ప్రభాకర్
4. పెద్దపల్లి- శ్రీధర్‌బాబు
5. మహబూబ్‌నగర్- సంపత్‌కుమార్
6. వరంగల్ - ప్రకాశ్‌రెడ్డి
7. మహబూబాబాద్ - తుమ్మల నాగేశ్వరరావు
8. హైదరాబాద్ - ఒబేదుల్లా కొత్వాల్
9. సికింద్రాబాద్ - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
10. భువనగిరి- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
11. నాగర్‌కర్నూల్ - జూపల్లి కృష్ణారావు
12. చేవెళ్ల - నరేందర్‌రెడ్డి
13. మల్కాజిగిరి - మైనంపల్లి హన్మంతరావు
14. మెదక్- కొండా సురేఖ
15. నిజామాబాద్ - సుదర్శన్‌రెడ్డి
16. ఆదిలాబాద్ - సీతక్క
17. జహీరాబాద్, దామోదర రాజనర్సింహ

# జైలు నుంచే ఆరు గ్యారంటీలు ప్రకటించిన కేజ్రీవాల్

- నా భర్తకు దేశవ్యాప్తంగా మద్దతు
- కేజ్రీవాల్ ను శాశ్వతంగా జైల్లో ఉంచగలరా?
- ఆయన సతీమణి సునీత వెల్లడి

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

గడిచిన 75 ఏళ్లుగా దిల్లీ ప్రజలకు అన్యాయం జరుగుతోందని.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశ రాజధానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పిస్తామని అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నట్లు ఆయన సతీమణి సునీత వెల్లడించారు. విపక్ష కూటమి ఆదివారం ఢిల్లీలో చేపట్టిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆమె.. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. విద్య, వైద్యంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని.. విపక్ష కూటమికి అవకాశం కల్పిస్తే గొప్ప దేశాన్ని నిర్మిస్తామని కేజ్రీవాల్ తన సందేశంలో పేర్కొన్నారు. భారతమాత ఇబ్బందుల్లో ఉందని, ఈ దౌర్జన్యం మిగతా 2లో



# ఢిల్లీలో ఇండియా మెగా ర్యాలీ

'ఢిల్లీ లిక్కర్‌పాలసీ' కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, పన్ను ఎగవేశారంటూ కాంగ్రెస్ పార్టీకి రూ. 1,800 కోట్ల మేర ఐటీ నోటీసులు సహా విపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐలను ప్రయోగించి బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందని 'ఇండియా కూటమి' ఆరోపిస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ అరెస్టు అక్రమమంటూ ఆప్, ప్రతిపక్ష నేతలు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిరసనకు దిగారు.




మిగతా 2లో



పోడు భూముల పంచాయితీలో..

## పోలీసులపై తిరగబడిన గిరిజనులు

- సత్తుపల్లి సీఐకి తీవ్ర గాయాలు
- ఖమ్మం జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

వివరాలు 2లో

# కాంగ్రెస్‌ను వదిలిపెట్టం
# వెంటాడుతాం.. వేటాడుతాం





మొదటిపేజీ తరువాయి

తరుముతం. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక ఇడిసిపెట్టేది లేదు. బ్యాంకులోళ్లు రైతుల ముక్కుపిండి రుణాలు వసూలు చేస్తున్నరు. మీకు బాధ లేదా..? కనీసం రైతుల దుస్థితి గురించి ఆలోచనైనా చేస్తున్నరా..? రైతుల పక్షాన ఎవడు మాట్లాడెటోడు లేదు, అడిగేటోడు లేడని మీరు అనుకుంటున్నరా..?' అని కేసీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

'నేను రైతులకు చేతులెత్తి దండం పెట్టి చెబుతున్నా. రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీ కోసం బీఆర్ఎస్ పార్టీ రణరంగమైనా సృష్టిస్తది. ప్రధాన ప్రతిపక్షంగా మీరు మాకు బాధ్యత ఇచ్చారు. కానీ ఎమ్మటే మాట్లాడితే ఓర్వలేని తనం అంటరని ఓపిక పట్టిన. ఇప్పుడు నాలుగో నెల వచ్చింది. లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నయ్ కాబట్టి చూస్తూ ఊరుకోలేక వచ్చిన' అన్నారు. అదేవిధంగా వాగ్దానలు ఎగవెడితే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'మీరు వాగ్ధానాలను ఎగవెట్టి ఊరేగుదాం అనుకుంటున్నరా..? వాగ్ధానాలు ఎగవెడితే బిడ్డా నిద్ర గూడ పోనియ్యం చెప్తున్నా' అని కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో పోలీసులు ప్రజలపట్ల, ప్రతిపక్ష పార్టీ శ్రేణులపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. ఈ దురుసు ప్రవర్తనను తగ్గించుకోవాలని హెచ్చరించారు. ఆదివారం సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన పోలీసుల తీరును తప్పుపట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికార పార్టీ కోసం దురుసుగా ప్రవర్తించడం సబబు కాదని కేసీఆర్ హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో పోలీసులు ప్రజలపట్ల, ప్రతిపక్ష పార్టీ శ్రేణులపట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. ఈ దురుసు ప్రవర్తనను తగ్గించుకోవాలని హెచ్చరించారు. ఇవాళ సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన పోలీసుల తీరును తప్పుపట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికార పార్టీ కోసం దురుసుగా ప్రవర్తించడం సబబు కాదని కేసీఆర్ హితవు పలికారు.

'ప్రజాస్వామ్యంలో ప్రజలుంటరు. ప్రజలకు బాధలుంటయ్. ప్రజాస్వామ్యంలో అతిగా పోవద్దని పోలీస్ మిత్రులకు చెబుతున్నా. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మేం గూడా పదేళ్లు అధికారంలో ఉన్నం. పదేళ్లలో మేం ఇదే దురుసు ప్రవర్తనకు పోతే కాంగ్రెస్ నశ్యానికి కూడా మిగలకుండె. పదేళ్లు మేం ప్రజల సంక్షేమానికి పనికొచ్చే పనులు చేసినం. ఉన్నోన్ని లేనోన్ని కదుపుల పెట్టుకుని కంటికిరెప్పలా చూసుకున్నం. అదే ప్రజలను ఇప్పుడు మీరు మోసం చేస్తమంటే ఊరుకోం. రెండు లక్షల రుణ మాఫీ ఏమైంది..? ఎందుకు స్పందిస్తలేరు. ఎప్పటికల్లా చేస్తరో ఎందుకు చెప్తలేరు..? బ్యాంకులు రైతులకు నోటీలిస్తున్నా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపరు..? దానికి సమాధానం కావాలి. మేం ప్రజల పక్షాన, రైతాంగం పక్షాన అడుగుతున్నం' అన్నారు.

వరి పంటకు రూ.500 బోనస్ ఇయ్యాలె: కేసీఆర్

'ప్రభుత్వం వరి పంటకు రూ.500 బోనస్ ఇయ్యాలె. రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలంటూ ఏప్రిల్ 2న బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా కలెక్టర్లకు రైతుల పక్షాన మెమొరాండం సమర్పించండి. అదే రోజున శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులం హైదరాబాద్‌లో ప్రభుత్వానికి మెమొరాండం ఇస్తం. ఏప్రిల్ 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వరి పంటకు బోనస్ కోసం దీక్షలు చేయండి. బోనస్ ఇచ్చే దాకా కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తే లేదు. రైతులకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దు. ఎప్పుడూ ఈ అసమర్థ పాలనే ఉండదు. మీ కోసం ఈ ప్రభుత్వంతో పోరాడుతం. అందరం కలిసి యుద్ధం చేద్దాం. వాళ్లు ఇచ్చిన వాగ్ధానాలన్నీ నెరవేర్చే దాకా వెంటపడి తరుముదాం. దయచేసి ఆత్మస్తైర్యం కోల్పోవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా' అని కేసీఆర్ అన్నారు. అద్భుతమైన మంచినీళ్ల సదుపాయం ఉన్న తెలంగాణలో.. నా కండ్ల ముందే మళ్లీ ట్యాంకర్లు కొనుక్కునే దౌర్భాగ్యం వస్తదనుకోలేదంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మిషన్ భగీరథ పట్టించుకునే నాథుడే లేదు. నేను రెండుమూడు జిల్లాల ఇంజినీర్లను అడిగాను. నిర్మించింది మీరే.. నడిపింది మీరే ఇప్పుడేమైందని అడిగితే.. సార్ ఇందులో అసలు కిటుకు వేరే ఉన్నది. అడిగేవాడు లేడు.. మీ ఆఫీసులో స్మితా సబర్వాల్ అనే సెక్రెటరీ సఫరేట్‌గా ఉండేవారు. ప్రతిరోజూ మానిటరింగ్ చేస్తుండే. ఎక్కడున్నా ఆమె గద్దలా వచ్చివాలి అందరు ఇంజినీర్లను తీసుకువచ్చి సమీక్షస్తుండేది. బ్రహ్మాండంగా జరుగుతుండేది. చిన్న పైపు పోయినా తెల్లవారేలోగా మళ్లీ వేసేవారు. ఇవాళ 15 రోజులైనా పట్టించుకునే పరిస్థితి లేదని చెబుతున్నరు. మిషన్ భగీరథ నీళ్లు కరెంటు రావాలంటే.. నాణ్యత గల కరెంటు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి. ఈ ప్రభుత్వం తెలివితక్కువ తనం వల్ల మళ్లీ ఇవాళ లక్షల మోటార్లు కాలిపోతున్నయ్. ఒక్కో రైతు మోటారు రెండుమూడు సార్లు కాలిపోతున్నాయి. ఎందుకు ఈ పరిణామాలు జరుగుతున్నయ్. ఇంకా మూడు నెలలు గడవాలి. జూన్ చివరిపోతే తప్పా ఊటలు రావు. అది భగవంతుడు కరుణించి వర్షాలు కురిస్తే మళ్లీ నీటి ఊటలు వస్తయ్. మూడు మూడున్నర నెలలు ఇంకా ఎంత భయంకరంగా పరిస్థితి ఉంటది. నేను బాధతో.. దుఃఖంతో మాట్లాడుతున్నా. అద్భుతమైన మంచినీళ్ల సదుపాయం ఉన్న తెలంగాణ నాకండ్ల ముందే నాశనమైతది అనుకోలేదు' అన్నారు.

### ఏ కారణంతో నీళ్ల గోస వచ్చింది..?

'నేను బాధతో మాట్లాడుతున్న.. అద్భుతమైన మంచి నీళ్ల సదుపాయం ఉన్న తెలంగాణ.. 100 రోజుల్లో నా కండ్ల ముందే ఇంత నాశనమైతది. నా కండ్ల ముందే బిందెలు పట్టుకుని తిరుగుతరు.. నా కండ్ల ముందే బోర్లు వేసుకునే దుస్థితి వస్తది.. నా కండ్ల ముందే ట్యాంకర్లు కొనుక్కోవాల్సిన దౌర్భాగ్యం వస్తది అని నేను అనుకోలేదు. ఏ కారణంతో నీళ్లకు షాటేజీ వచ్చింది? హైదరాబాద్ ఏనాటికైనా ప్రధానం కాబట్టి ఎల్లంపల్లి నుంచి సింగిల్ లైన్ ఉంది.. సంవత్సరానికి 12 టీఎంసీ వస్తది.. కృష్ణా నుంచే ఫేజ్ ఉందని.. సాగర్‌లో 100 టీఎంసీల పైచిలుకు డెడ్ స్టోరేజీ ఉంటదని.. పాత అక్కంపల్లి మీదనే ఆధారపడకుండా రూ.1,450 కోట్లతో సుంకిశాల ప్రాజెక్టును మంజూరు చేశాం. మా ప్రభుత్వం పోయేనాటికే 70 75 శాతం పనులు కూడా అయిపోయాయి. మొన్న కాంట్రాక్టర్‌ను అడిగితే.. ఈ గవర్నమెంట్ చెబితే రెండు మూడు నెలల చేసి అందిస్తామని చెప్పారు. ఒక్కసారి అది పూర్తయితే నీటి సదుపాయానికి ఢోకా ఉండదు. సాగర్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం వాడుకునే పరిస్థితి ఉంటది. ఇవేవీ చేయకుండా.. సమీక్షలు లేకుండా.. అడ్డగోలు మాటలు.. పిచ్చి ప్రచారాలు చేస్తున్నారు. ఎంతసేపు గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే చిల్లర ట్రిక్స్ తప్ప ఏమీ కనిపించడం లేదన్నారు' అంటూ కేసీఆర్ మండిపడ్డారు.





# ఎల్ కే అద్వానీకి భారతరత్న ప్రదానం..

మొదటిపేజీ తరువాయి

ఆయన మనువడు జయంత్ చౌదరి, స్వామినాథన్ తరఫున ఆయన కుమార్తె నిత్యారావు, కర్పూరీ ఠాకుర్ తరఫున ఆయన కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్‌లు పురస్కారాలు అందుకున్నారు.

### 14 ఏండ్లకే ఆర్ఎస్ఎస్‌లోకి ..

1927 నవంబరు 8న అవిభాజ్య భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాక్‌లో ఉంది)లో అద్వానీ జన్మించారు. అక్కడే సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. 1941లో తన పద్నాలుగేండ్ల వయస్సులో ఆయన ఆర్ఎస్ ఎస్‌లో చేరారు. 1947లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కరాచీ విభాగం కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. పాక్‌లోని హైదరాబాద్‌లో ఉన్న డీజీ నేషనల్ కాలేజీలో న్యాయవిద్య పూర్తి చేశారు. దేశ విభజన తర్వాత ముంబయిలో స్థిరపడ్డారు. తొలుత రాజస్థాన్‌లో సంఘ్ ప్రచారక్‌గా పనిచేశారు. 1957లో ఢిల్లీకి వెళ్లి జన్‌సంఘ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించారు. 1967లో ఆ కౌన్సిల్ చైర్మన్‌గా గెలిచారు. 1970-72లో భారతీయ జనసంఘ్ ఢిల్లీ విభాగం ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. 'ఆర్గనైజర్' పత్రికలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు. అయోధ్య రథ యాత్రతో పాటు పలు యాత్రలు చేసి తనదైన ముద్ర వేశారు. రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంటులో అడుగు అద్వానీ 1970లో ఢిల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారు. 1976లో గుజరాత్ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లారు. 1977-80లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ పార్టీ ప్రభుత్వంలో 1977- 79 మధ్య కేంద్ర సమాచారప్రసార శాఖ మంత్రిగా పనిచేశారు. 1980లో జనతా పార్టీ ఓటమి పాలైన అనంతరం రాజ్యసభలో కొంతకాలం పాటు ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు.

### పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు

**1980 ఏప్రిల్ 6న వాజ్‌పేయితో కలిసి భారతీయ జనతా పార్టీని స్థాపించారు. 1982లో మధ్యప్రదేశ్ నుంచి మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. వాజ్‌పేయి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆ ప్రభుత్వం 13 రోజులకే కూలిపోయింది. ఆ తర్వాత 1998లో మిత్రపక్షాలతో కలిసి బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1999లో జరిగిన ఎన్నికల్లో గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి అద్వానీ గెలిచారు. 2004 ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలవ్వడంతో అద్వానీ ప్రతిపక్ష నాయకుడిగా నియమితులయ్యారు. లోక్‌సభలో సుదీర్ఘకాలం పాటు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా పోటీచేశారు. కానీ, ఆ ఎన్నికల్లో కాషాయ దళం ఓడిపోయింది. 2014లో మరోసారి గాంధీనగర్ నుంచి గెలుపొందిన అద్వానీ 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.**

# దమ్ముంటే 200 సీట్లు.. గెలవండి చూద్దాం

- బెంగాల్‌లో సీఏఏ అమలు చేసే ప్రసక్తే లేదు
- మా రాష్ట్రంలో ఇండియా కూటమి లేదు
- కాంగ్రెస్, సీపీఎం బీజేపీతో చేతులు కలిపాయి
- పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

విశాలభారతి,నేషనల్ బ్యూరో:

బీజేపీకి దమ్ముంటే 200 సీట్లు గెలవాలంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సవాల్ విసిరారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 400కుపైగా స్థానాల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీజేపీ చెబుతోన్న విషయం తెలిసిందే. వీటిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. కనీసం 200 నియోజకవర్గాల్లో గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. తమ రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (CAA) అమలు చేయబోమని ఉద్ఘాటించిన దీదీ.. సీఏఏకు దరఖాస్తు చేసుకుంటే విదేశీయులుగా మారతారని హెచ్చరించారు. '400లకుపైగా స్థానాల్లో గెలుస్తామని బీజేపీ చెబుతోంది. కనీసం 200 మార్కు దాటమని చెప్పండి. సవాల్ విసురుతున్నా. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 200లకుపైగా సీట్లలో గెలుస్తామని చెప్పారు. కానీ, 77 దగ్గరే ఆగిపోయారు' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన సీపీఎం, కాంగ్రెస్‌లపైనా దీదీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆ రెండు పార్టీలూ బీజేపీతో చేతులు కలుపుతున్నాయని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో 'ఇండియా 'కూటమి లేదన్నారు. పౌరసత్వం ఉన్నవారిని విదేశీయులుగా మార్చేందుకు సీఏఏ ఒక మార్గమని బెంగాల్ సీఎం ఆరోపించారు. రాష్ట్రంలో సీఏఏ, ఎన్ఆర్‌సీలను అనుమతించే ప్రసక్తే లేదన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలు ప్రభుత్వ వైఫల్యాలా?

మొదటిపేజీ తరువాయి

ఖాళీ చేసిన ప్రబుద్ధులు మీరు కారా.? నీటి నిర్వహణ మీద కనీస ధృష్టి పెట్టకుండా, మంచినీటి కోసం ప్రక్క రాష్ట్రాలని అభ్యర్థించవల్సిన అధోగతికి ఈ రాష్ట్రానికి తీసుకువచ్చింది మీరు కాదా? రైతుబంధు పథకాన్ని మే నెల వరకు ఇచ్చిన ఘనత సొంతం చేసుకున్న ప్రభుత్వం మీది కాదా? అని ప్రశ్నించారు. మీరు చేసే ప్రతి కార్యక్రమంలో అవినీతి, మీ కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు, ఆఖరికి నికృష్టమైన ఫోన్ ట్యాపింగ్ కు కూడా బరితెగించి కుటుంబసభ్యులు కూడా స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం లేకుండా చేసిన మీరు, పాలన వ్యవస్థలో ఇన్ని అరిష్టాలకు, అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడిన మీరు.. ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారు..?వర్షాభావ పరిస్థితులను కూడా రాజకీయం చేయాలనుకొనే హేయమైన పనులకు పాల్పడుతూ మీ వ్యక్తిత్వాన్ని హననం చేసుకొనే పరిస్థితులు తెచ్చుకుంటున్నది మీరు కాదా..?ఎంత నికృష్టుడైనా వర్షాభావ పరిస్థితులని, కరువు పరిస్థితులని రాజకీయం కోసం వాడుకొంటారా? గత ప్రభుత్వం మాదిరిగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉండదు. పంటలభీమా పథకాన్ని పునరుద్ధరించి దాదాపు 2500 కోట్ల వరకు రైతుల ప్రీమియం కూడా ఈ ప్రభుత్వమే భరించి భవిష్యత్తులో ఏ ఒక్క రైతుకూడా ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోకూడదని ధృఢ సంకల్పం తీసుకున్నది. మీరు చేసిన నిర్వాకాలన్నిటీని ఇప్పటి ప్రభుత్వం మీద నెట్టివేసే రోజులు చెల్లినాయి. అటువంటి విషప్రయోగాలు ఈ తెలంగాణ ప్రజలు హర్షించరు. తెలంగాణ ప్రజలలో అంతో ఇంతో మిగిలిన మీ వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దని మిత్రుడిగా నేను మీకిచ్చే సలహా.' అని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లోకి కడియం, కావ్య

మొదటిపేజీ తరువాయి

మారింది. కొద్దిరోజులుగా వస్తున్న అవినీతి ఆరోపణలు, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కాం తదితర అంశాలు బీఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజార్చాయని పేర్కొంటూ లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి కావ్య తప్పుకొన్నారు. జిల్లాలోని నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేకపోవడం, ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండడం పార్టీకి మరింత నష్టం చేసిందని.. ఈ పరిస్థితుల్లో తాను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నానని ఆమె కేసీఆర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. అనంతరం కడియం శ్రీహరి, కావ్యను కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆ పార్టీలోకి ఆహ్వానించడం.. ఆదివారం చేరిపోవడం జరిగిపోయాయి. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య లేదా కడియం శ్రీహరిని నిలిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలా జరగని పక్షంలో కడియం శ్రీహరికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తారన్న ఊహాగానాలూ వినిపిస్తున్నాయి. మరో వైపు నేడు ఢిల్లీలో కాంగ్రెస్ సీఈసీ భేటీ ఉండగా వరంగల్ టికెట్ కడియం శ్రీహరి ఫ్యామిలీకి కేటాయిస్తారా? ఉత్కంఠగా మారింది.

# ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ట్యాపింగ్!

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోంది. మూడో రోజైన ఆదివారం తిరుపతన్న, భుజంగరావులను బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ప్రశ్నిస్తున్నారు. విచారణలో మరికొందరి పేర్లను భుజంగరావు చెప్పినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ ఎస్ఐబీ ఆఫీస్‌తో పాటు సిటీ శివారు ప్రాంతాల్లో సర్వర్ రూమ్స్ ఏర్పాటు చేసినట్టు భుజంగరావు స్టేట్‌మెంట్‌తో.. ఆ సర్వర్ రూంలో పనిచేసిన అధికారులను దర్యాప్తు బృందం విచారణకు పిలిచింది. ఎస్ఐబీ లో పనిచేసిన మరో ముగ్గురు అధికారులను కూడా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిచిన దర్యాప్తు బృందం.. విచారిస్తోంది. ప్రణీత్ రావు, రాధా కిషన్ రావు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా తిరుపతన్న, భుజంగరావును అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎస్ఐబీ మాజీ డైరెక్టర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డట్టు తిరుపతన్న, భుజంగరావు చెప్పారు. అయితే కేసులో ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై దర్యాప్తు అధికారులు న్యాయ సలహా తీసుకుంటున్నారు. మరోవైపు తిరుపతన్న, భుజంగరావు వాడిన కంప్యూటర్స్, సెల్‌ఫోన్స్ ను అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో డబ్బు రవాణాకు టాస్క్ ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసులను వాడుకున్నట్టు దర్యాప్తు బృందం గుర్తించింది. సోమవారం నాంపల్లి కోర్టులో రాధాకిషన్ రావును వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ దర్యాప్తు బృందం పిటిషన్ వేయనుంది.

# ఢిల్లీలో ఇండియా మెగా ర్యాలీ

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆందోళన
- కాంగ్రెస్ కు రూ.1,800 కోట్ల మేర ఐటీ నోటీసులు
- రామ్‌లీలా మైదానంలో విపక్ష కూటమి లీడర్లు ఫైర్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష కూటమి ఇండియా ఆదివారం నిరసన చేపట్టింది. 'ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదం' తో విపక్ష ఇండియా కూటమి ఢిల్లీలో భారీ ర్యాలీని తలపెట్టింది. కేజ్రీవాల్ అరెస్ట్ , కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులపై బీజేపీతో యుద్ధానికి సిద్ధమైన ఇండియా.. ఇందులో భాగంగానే ఢిల్లీ రాంలీలా మైదానంలో మెగా ర్యాలీ నిర్వహిస్తోంది. కూటమిలోని 29 పార్టీలూ ఈ నిరసనలో పాల్గొంటున్నాయి. నకిలీ దర్యాప్తు పేరుతో గత రెండేండ్లు కేంద్రంలోని బీజేపీ టార్గెట్ చేసిందని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంకా కక్కర్ అన్నారు. ' ఎలాంటి అధారాలు లేకుండా కొందరి నకిలీ ప్రకటనలతో సీఎంను అరెస్ట్ చేశారు. ఇది మా పార్టీ గొంతు నొక్కాలనే కుట్రలో భాగం.. ఎవరైతే బీజేపీని ప్రశ్నిస్తారో వాళ్లను జైల్లో వేయటమే వారి పని' అని ప్రియాంకా దుయ్యబట్టారు. ఇండియా కూటమి ర్యాలీకి బయలుదేరి ఝార్ఖండ్ సీఎం చంపా సోరెన్ మాట్లాడుతూ.. నియంతృత్వానికి స్వస్తి పలికి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అన్నారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ సహా కీలకనేతల పాల్గొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కారు దుర్వినియోగం చేస్తోందన్న విపక్షాలు.. ఆదివారం ర్యాలీలో ఇదే అంశాన్ని ప్రధానంగా జనంలోకి తీసుకెళ్లనున్నాయి. ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్ (ఎన్సీపీ-ఎస్‌సీపీ), ఆర్జేడీ నుంచి తేజస్వీ యాదవ్, కమ్యూనిస్ట్ పార్టీల నుంచి సీతారాం ఏచూరి, డి.రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ తదితరులు హాజరయ్యారు.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీతకు ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ సతీమణి కల్పన సొరేన్ శనివారం సంఘీభావం తెలిపారు. శక్తివంతులైన మహిళలు కలవడంతో బీజేపీ భయపడి ఉంటుందని.. వీరిద్దరి సమావేశంపై ఢిల్లీ మంత్రి ఆతీషి ట్వీట్ చేశారు. సునీత కేజ్రీవాల్‌కు యావత్తు ఝార్ఖండ్ ప్రజానీకం అండగా ఉంటారని, తాము ఒకరి ఆవేదనను మరొకరం పంచుకున్నామని, కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించామని తెలిపారు.

# జైలు నుంచే ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కేజ్రీవాల్

మొదటిపేజీ తరువాయి

పనిచేయదని సునీత అన్నారు. తన భర్తకు దేశవ్యాప్తంగా ఎంతో మద్దతు లభిస్తోందన్నారు. దిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగిన సభలో భావోద్వేగ ప్రసంగం చేసిన సునీత.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశ ప్రజలు కేజ్రీవాల్‌తోనే ఉన్నారని, ఆయన్ను ఎప్పటికీ జైల్లోనే ఉంచలేరన్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పంపిన సందేశంలోని ఆరు గ్యారంటీలను వెల్లడించారు. "దేశవ్యాప్తంగా కరెంటు కోతలు ఉండవు. పేదలకు ఉచిత విద్యుత్తు అమలు. సమాజంలోని అన్ని వర్గాల వారి కోసం నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి గ్రామంలో మంచి పాఠశాల. ప్రతి గ్రామంలోనూ మొహల్లా క్లినిక్, ప్రతి జిల్లాకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి. స్వామినాథన్ నివేదిక ఆధారంగా రైతుల పంటలకు కనీస మద్దతు ధర. దిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పిస్తాం" అని కేజ్రీవాల్ తన సందేశంలో పేర్కొన్నారు.

### పోడు భూముల పంచాయితీలో..

# పోలీసులపై తిరగబడిన గిరిజనులు

విశాల భారతి, స్టేట్ బ్యూరో:

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం గ్రామంలో చోటుచేసుకున్న పోడు భూముల వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. గత కొంత కాలంగా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామానికి చెందిన రెండు గిరిజన తెగల మధ్య పోడు భూముల విషయంలో వివాదం చోటు చేసుకుంటుంది. ఈ క్రమంలో ఆదివారం ఇరు తెగలకు చెందిన గిరిజనులు వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్తత చోటుచేసుకోగా సమాచారం అందుకున్న సత్తుపల్లి సీఐ కిరణ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోడు భూముల విషయంలో ఇరు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు సీఐ కిరణ్ ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిని వారిస్తుండగా ఆగ్రహానికి లోనైన గిరిజనులు సీఐపై కూడా కర్రలతో దాడికి తెగించారు. సీఐ కిరణ్ ను కాపాడేందుకు ప్రయత్నించిన మరో నలుగురు పోలీసులను కూడా తీవ్రంగా గాయపరిచారు. దీంతో పరిస్థితి చేయి దాటుతుందని గమనించిన పోలీసులు ఆత్మ రక్షణలో పడ్డాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరికి సీఐ సహా పలువురు సిబ్బంది గిరిజనుల నుంచి తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్ర గాయాలైన కిరణ్ తో పాటు ఇతర పోలీసులను సత్తుపల్లిలోని హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున ఆ గ్రామాల మధ్య మోహరించారు. దాడికి కారణమైన 30 మంది గిరిజనులను అదుపులోకి తీసుకుని సత్తుపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

### గతంలో ఫారెస్ట్ అధికారి హత్య కలకలం

గతంలో పోడు భూముల వివాదంలోనే ఖమ్మం జిల్లాకు చెందిన ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు హత్య చోటు చేసుకోవడం తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రబోడు గ్రామంలో గిరిజన తెగలకు చెందిన ప్రజలు ఫారెస్టు భూమిలో వ్యవసాయం చేస్తున్నారన్న సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటుతున్న వ్యక్తులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అగ్రహావేశాలకు లోనైన ఇద్దరు వ్యక్తులు ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు పై విరుచుకుపడి ఒక్కసారిగా దాడి చేశారు. వారి వద్ద ఉన్న కత్తితో శ్రీనివాసరావు గొంతు కోసి హత్య చేశారు. ఈ హఠాత్ పరిణామంతో ఆయనతో వచ్చిన ఇద్దరు సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అక్కడి నుంచి పారిపోయారు.

# కేసీఆర్ పర్యటన సినిమా షూటింగ్‌ను తలపించింది

- ముందు తీహారు జైల్లో ఉన్న నీ కూతురిని పరామర్శించు
- పర్యటన అంతా స్క్రిప్టెడ్
- నీటి రాజకీయాలు చేయడం మానుకో కేసీఆర్
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి

**పాలకుర్తి,విశాల భారతి:**

దేవరుప్పులలో కేసీఆర్ పర్యటన సినిమా షూటింగ్‌ను తలపించిందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి ఝాన్సీరెడ్డి సెటైర్లు వేశారు. పొలం బాటలో భాగంగా ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ దేవరుప్పులలో పర్యటించి ఎండిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. కాగా కేసీఆర్ విమర్శలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి తిప్పి కొట్టారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..**

కేసీఆర్ వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగడం వల్లే నీటిని దిగువకు విడుదల చేశారని, దానివల్లే ఈ పరిస్థితి నెలకొందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తన అక్కసు వెళ్ళగకుతున్నారని అన్నారు. అందుకే అసత్య ప్రచారాలు చేస్తూ తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని అన్నారు. కేసీఆర్ పర్యటించిన పొలంలో వరుసగా నాలుగు బోర్లు వేయడం అనుమానంగా ఉందని అన్నారు. గత పది రోజుల్లో అదే పొలాన్ని కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు ఆ అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ముందు తీహార్ జైల్లో ఉన్న తన కూతురు కవితను కేసీఆర్



పరామర్శించాలని ఎద్దేవా చేశారు.

**అనంతరం ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ..**

కేసీఆర్ పర్యటన అంతా స్క్రిప్ట్ అని ఎద్దేవా చేశారు. కావాలనే కేసీఆర్ నీటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అసెంబ్లీలో అడుగు పెట్టని కేసీఆర్.. పొలంబాట పేరుతో పర్యటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ టైటానిక్ షిప్

- ఇప్పట్లో పైకి లేవడం కష్టమే..
- రఘునందన్ ను కొట్టాలంటే లోకల్ లీడర్స్ లేరా?
- హరీశ్ రావు అక్రమార్కుడు
- కాట శ్రీనివాస్ ఓటమికి కారణమైన నీలం మధుకు కాంగ్రెస్ టిక్కెట్టా?
- మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రఘునందన్ రావుని కొట్టడానికి బీఆర్ఎస్ పార్టీ పక్క జిల్లా వ్యక్తిని తీసుకువచ్చిందని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విమర్శించారు. తనను ఎదుర్కోవడానికి మెదక్ జిల్లాలో ఒక్కరు కూడా దొరకలేదా అని ప్రశ్నించారు. ఆదివారం నాడు సిద్ధిపేట జిల్లా ములుగులో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పరిస్థితి టైటానిక్ నావలా తయారైందన్నారు. టైటానిక్ చరిత్ర బయటికి రావడానికి ఐదు వందల ఏళ్లు పట్టిందని , బీఆర్ఎస్ పరిస్థితి కూడా అంతేనన్నారు. హరీష్ రావుకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వకపోవచ్చని ఫోన్ ట్యాపింగే కారణం కావచ్చని రఘునందన్ రావు చెప్పారు. 610 జీఓ గనక అమలులోకి వస్తే ముందు హరీష్ రావే స్థానికేతరడు అవుతాదన్నారు. రబ్బర్ చెప్పులతో వచ్చిన హరీష్ రావుకు వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు..హరీశ్ రావు ఆస్థుల పై ములుగు మండలంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. హరీష్ రావు కూడా ఏదో ఒక రోజు కారు దిగి పోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గజ్వేల్ అభివృద్ధికి అడ్డుపడే వాడినే అయితే ములుగు హార్టికల్చర్ యునివర్సిటీనీ దుబ్బాక నియోజకవర్గానికి ఎప్పుడో తీసుకుని పోయేవాడినన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఊరిలో కూడా బీఆరెస్ కు ఓట్లు పడే అవకాశం కనిపించడం లేదని రఘునందన్ రావు తెలిపారు. పటాన్ చెరు నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కాట శ్రీనివాస్ ఓటమికి కారణమైన నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టిక్కెట్ ఇచ్చిందని అయన ఆరోపించారు. నోట్ల కట్టలు తెచ్చినందుకే నీలం మధుకు



కాంగ్రెస్ పార్టీ నేతలు మెదక్ ఎంపీ టిక్కెట్ ఇచ్చారని విమర్శించారు. నిన్నటి , మొన్నటి వరకు దోచుకున్న , దాచుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామరెడ్డి ప్రజా సేవ చేయడానికి వస్తున్నానంటే ఎవరూ నమ్మరన్నారు. వెంకట్రామరెడ్డి దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి వస్తున్నడని రఘునందన్ రావు విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి బీజేపీకి వంద ఓట్ల వేయించాలని విజ్ఞప్తి చేశారు.





# కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోతాం

- ఉద్దెర హామీలు తప్ప ఉద్ధరించింది ఏమీ లేదు
- బీఆర్ఎస్ హామీలను కూడా అమలు చేయడం లేదు
- 2 లక్షల రుణమాఫీ ఎటు పోయింది
- పెంఛన్ 4000 ఎందుకు ఇస్తలేరు
- వరి రైతులకు బోనస్ ఎక్కడ ?
- మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నల వర్షం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ, రూ.వేల పెన్షన్, తులం బంగారం ఇవ్వకపోయినా ప్రజలు అంగీకరించారని కాంగ్రెస్ వాళ్లు అంటారని.. కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వందరోజుల కాంగ్రెస్ బాండ్ పేపర్ పాలనలో ఉద్ధరించుడు మాట దేవుడెరుగు కానీ, అన్నీ ఉద్దెర మాటలే చెప్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇస్తానన్న మొదట హామీ అయిన ప్రతి నెల రూ. 2,500 డిసెంబర్ నెల నుంచి ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలి. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. కొత్త హామీలు అమలుకాకపోగా.. ఉన్న పథకాలు కూడా అటకెక్కించిన ఘనత పార్టీది. కాంగ్రెస్ పార్టీ వచ్చింది. కరువు వచ్చింది. కరెంట్ మోటార్లు కాలిపోతున్నయి' అన్నారు.

**రెఫరెండంగా చూపించి మోసం చేసే అవకాశం..**

'వందరోజుల పాలనను రేపు ఎన్నికల రెఫరెండంగా చూపించి మనల్ని మోసం చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్‌కి ఓటు వేస్తే మోసపోతాం. రూ.2లక్షల రుణమాఫీ, రూ.4వేల పెన్షన్, తులం బంగారం ఇవ్వకపోయినా ప్రజలు అంగీకరించారంటారు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలి. దీనిపైన ప్రతి గ్రామంలో చర్చ జరగాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదు. యాసంగి వడ్లకు 500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారో ప్రశ్నించాలి. కారుకు ఓటేసి



వాళ్లకు గుణపాఠం నేర్పాలి. రూ.2లక్షలు రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి. కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయండి. వందరోజుల్లో హామీలను అమలుచేస్తామని మాట తప్పిన కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేసి మోసపోవద్దు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన నాయకులకు మీరు ఈ రోజు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది' అని పిలుపునిచ్చారు.

**బీజేపీకి ఎందుకు ఓటేయాలి..?**

'నిరుద్యోగులను, రైతులను మోసం చేసిన పార్టీ బీజేపీ. ఎందుకు బీజేపీకి ఓటు వేయాలి? ఏం ఇచ్చిందని బీజేపీ పార్టీకి ఓటు వేయాలి? రాముడి అక్షింతల పేరుతో రాజకీయం చేయడం తప్పా.. తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదు. సోషల్ మీడియాలో లీకు న్యూస్‌లు, ఫేకు వార్తలతో గోబెల్స్ ప్రచారం చేయిస్తూ రాజకీయ పబ్బం గడుపుతుంది కాంగ్రెస్ పార్టీ. బీఆర్ఎస్ నుంచి కారు గుర్తుపై గెలిచి ఇవాళ కాంగ్రెస్ కండువా కప్పుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి వెంటనే శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, స్పీకర్‌పై చర్యలు తీసుకొని, అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నాను. బీఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తరు కావచ్చు. కానీ, వారి ఆత్మ గౌరవాన్ని కొనలేరు. కార్యకర్తలు ఎవరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదు. గాంధేయవాదంతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు, మన అధినేత కేసీఆర్. అదే పోరాట స్ఫూర్తితో మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఉద్యమకారుడు గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలి' అని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ అధికారంలో కరెంటు కోతలు

- ఆరు గ్యారంటీల సమాధిపై ప్రభుత్వం ఏర్పాటు
- ప్రజలను మాయ చేసి మభ్యపెట్టింది
- పదేండ్లలో 1.61లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ
- బోయిన్‌పల్లి వినోద్‌కుమార్

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే 2001లో తెలంగాణ ఉద్యమం పుట్టిందని ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. 14 ఏండ్లు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులపై కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు సాగునీళ్లు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు మానకొండూర్ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ విద్యార్థి యువ చైతన్య సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వినోద్‌కుమార్ అన్నారు. ప్రజలను మాయ చేసి మభ్యపెట్టిందని విమర్శించారు. పదేండ్లలో 1.61లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలకు గత ప్రభుత్వం పరీక్షలు కూడా నిర్వహించిందని తెలిపారు. సీమాంధ్ర పాలనలో తెలంగాణలో అనేక ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తి అయితే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మాత్రం ఆంధ్ర ప్రాంతంలో నిర్మించారని... కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 26 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం చేసి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేశామని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కరెంటు కోతలు మొదలయ్యాయని మండిపడ్డారు.

2014 లో ఎంపీగా గెలిచిన తర్వాత కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ వరకు రైల్వే లైన్, కరీంనగర్ చుట్టుపక్కల నాలుగు జాతీయ రహదారులు, వెయ్యి కోట్లతో కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తీసుకొచ్చానని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించి.. 50 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించామని చెప్పారు. కానీ ప్రస్తుత ఎంపీ బండి సంజయ్



పట్టించుకోకపోవడంతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు దాన్ని తరలించిందని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ ఒక్క గుడి తేలేదు.. ఒక్క నవోదయ పాఠశాల తీసుకురాలేదని విమర్శించారు. బండి సంజయ్‌కు యువకులు, విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రం నుంచి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్చుకుని వచ్చి 30 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఇంకా 23 నవోదయ విద్యాలయాలు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. ఐదేండ్లలో ఐదు రూపాయలు కూడా తీసుకురాని బండి సంజయ్ ఏ అర్హతతో ప్రజలను ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# తన భర్తను చంపితే రూ.50,000 రివార్డు

## వాట్సాప్ స్టేటస్‌లో పోస్ట్ చేసిన భార్య

**విశాలభారతి:**

ఒక మహిళ తన వాట్సప్ స్టేటస్‌లో తన భర్తను చంపిన వారికి రూ.50,000 రివార్డు ఇస్తానని పోస్ట్ చేసింది. ఇది చూసిన ఆ మహిళ భర్త దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో బాహ్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాకు చెందిన మహిళతో 2022 జూలైలో వివాహం జరిగింది. అయితే పెళ్లి నాటి నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో ఆ ఏడాది డిసెంబర్‌లో ఆ మహిళ తన పుట్టింటికి వెళ్లింది. నాటి నుంచి అక్కడే ఉంటున్నది. అలాగే భర్త నుంచి నిర్వహణ ఖర్చులు కోరుతూ కేసు వేసింది. గత ఏడాది డిసెంబర్ 21న ఆ వ్యక్తి తన భార్య కోసం అత్తవారింటికి వెళ్లాడు. అయితే తనను చంపుతామని వారు బెదిరించారని భర్త ఆరోపించాడు. అనంతరం తనను హత్య చేసిన వారికి రూ.50,000 రివార్డు ఇస్తానని వాట్సాప్ స్టేటస్‌లో భార్య పోస్ట్ చేసిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ప్రియుడు కూడా తనను చంపుతానని ఫోన్‌లో బెదిరించినట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి




దర్యాప్తు చేస్తున్నట్లు బాహ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ శ్యామ్ సింగ్ తెలిపారు.

# రాముడి గురించి బిజెపి వాళ్లు నేర్చుకోండి

- అధికారం శాశ్వతం కాదని గుర్తించుకోవాలి
- బిజెపిపై ప్రియాంక గాంధీ విమర్శలు

**విశాలభారతి, ఢిల్లీ:**

రామ భక్తులుగా చెప్పుకొనే నేటి అధికార పార్టీ నాయకులు ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, అధికారం శాశ్వతం కాదని గుర్తించేందుకు ఆయన జీవితమే ఉదాహరణ అని కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ అన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. రామాయణ ఇతిహాసంలోని కొన్ని ఘట్టాలను ఉటంకిస్తూ అధికార



బిజెపిపై విమర్శలు గుప్పించారు.చిన్నతనంలో తన నాన్నమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి ఎన్నో సార్లు రామ్‌లీలా మైదానానికి వచ్చానని గుర్తు చేసుకున్న ప్రియాంక.. ఇక్కడ ప్రతియేటా నిర్వహించే రావణ దహనానికి హాజరైనప్పుడు ఆమె రామాయణం గురించి చెప్పేవారని అన్నారు. '' వేలాది సంవత్సరాల క్రితమే ఎలాంటి అధికారం, ఆయుధాలు లేకపోయినా రాముడు సత్యం, ధర్మం కోసం కోసం రావణుడిపై యుద్ధం ప్రకటించి విజయం సాధించాడు. ప్రస్తుతం ఇండియా కూటమి కూడా.. ధర్మం కోసమే పోరాటం చేస్తోంది. అది మనవైపే ఉంది. విజయం తప్పక వరిస్తుంది. అందులో ఎలాంటి సందేహం లేదు'' అని ప్రియాంక అన్నారు. అన్ని పార్టీలను ఎన్నికల సంఘం సమాన దృష్టితో చూడాలని ఆమె కోరారు. అప్రజాస్వామిక అడ్డంకులను తొలగించి.. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులను నిలిపివేసేలా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# బెట్టింగ్ లకు పెట్టడం నేరం

- ఐపిఎల్ క్రికెట్ టోర్నీ సందర్భంగా బెట్టింగ్ పై నిఘా
- బెట్టింగ్ ప్రలోబాలకు గురిచేస్తే కటిన చర్యలు తప్పవు
- బెట్టింగ్ సంకృతికి దూరంగా ఉండాలి



**సూర్యాపేట, విశాలభారతి:** ఐపీఎల్ క్రికెట్ నిర్వహణ సందర్భంగా జిల్లాలో బెట్టింగ్ లాంటి వాటిపై పోలీస్ శాఖ నిగా ఉంచిందని జిల్లా ఎస్పీ రాహుల్ ఐపీఎస్ ఆదివారం తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విష సంస్కృతి అని దీనివల్ల జీవితాలు ఆర్థికంగా నష్టపోయి, కుటుంబాలు నాశనం అవుతున్నాయని, బెట్టింగ్ సంస్కృతికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత బెట్టింగ్ మాఫియా మాయలో పడవద్దు అని ఎస్పీ కోరినారు. ఇది అత్యంత ప్రమాదకరమైనది వ్యసనం అన్నారు. బెట్టింగ్ యాప్స్, ఆన్లైన్ బెట్టింగ్ లు, ప్రత్యక్ష బెట్టింగ్ లపై నిఘా ఉంచాము అన్నారు.
పౌరులను, యువతను, విద్యార్థులను ఎవరైనా బెట్టింగులకు ప్రోత్సహించినా, బెట్టింగులు పెట్టడానికి ప్రలోభాలకు గురిచేసిన అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల, యువత యొక్క నడవడికపై, ఆర్థిక పరమైన అవసరాలపై గమనిస్తూ ఉండాలని కోరారు. బెట్టింగ్ లకు పాల్పడే వారి, బెట్టింగ్ నిర్వాహకులు, మధ్యవర్తులు ఎవరైనా ఉంటే ఎలాంటి వారి సమాచారం స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు, సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712686026 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# తిరుపతిరావు నిజమైన ప్రజా వైద్యులు

- ప్రాణాలు కాపాడడం కోసమే జీవితాన్ని త్యాగం చేసిన డాక్టర్ తిరుపతిరావు
- సిఐటియు రాష్ట్ర నాయకులు రాజారావు




**మణుగూరు, విశాల భారతి** : రోజురోజుకు కర్బన ఉద్గరాలు మానవ శరీరాలను దెబ్బతీస్తున్నాయని అంతుచిక్కని వ్యాధులతో మరణిస్తున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు)రాష్ట్ర అధ్యక్షులు రాజారావు అన్నారు. ఆదివారం కిన్నెర కల్యాణ మండపంలో ప్రజా వైద్యుడు డాక్టర్ తిరుపతి రావు సంస్మరణ సభ సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. అయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోజురోజుకు అడవులు అంతరించిపోవడం వాతావరణం సమతులత దెబ్బతింటుందన్నారు. అడవులు వేగంగా అంతరించిపోవడంతో కర్బన ఉద్గరాలు శాతం వాతావరణం లో విపరీతంగా పెరుగుతుందన్నారు. సింగరేణి ఉపరితల గనులలో భారీ వాహనాల ద్వారా విడుదల విడుదల అయ్యే కార్బన్ మోనాక్సైడ్, సబ్ క్రెటికల్ ద్వారా భద్రాద్రి పవర్ ప్లాంట్ మండిం చే బొగ్గు ద్వారా విష వాయువులు విడుదల వల్ల పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యల పై తీవ్ర దెబ్బతీస్తున్నాయన్నారు .
ఇటీవల కాలంలో అధిక సంఖ్యలో ప్రజలు అంతు చిక్కని మరియు మెదడు సంబంధించిన జబ్బులతో బాధపడుతున్నారని అన్నారు. ఆస్ట్రేలియా దిగుమతి అయ్యే బొగ్గు విషపూరిత మైందన్నారు భవిష్యత్ కాలంలో వాతావరణ మరింత విషపూరితం కానున్నదని అన్నారు. డాక్టర్ తిరుపతిరావు ఈ ప్రాంతంలో చేసిన వైద్య సేవల గురించి కొనియాడారు దేశవ్యాప్తంగా ఫాసిస్ట్ భావజాలంతో ప్రజలను రెచ్చగొడుతున్న బిజెపి కి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్న వామపక్షాలకు అండగా ఉండే డాక్టర్ తిరుపతిరావు లేని లోటు తీర్చలేనిది అన్నారు.
డాక్టర్ వృత్తి సంపాదన కోసం కాకుండా ప్రజల ప్రాణాల కోసం కాపాడడం ఉపయోగించిన తిరుపతిరావు నిజమైన ప్రజా వైద్యులు అని తెలిపారు. అన్ని సమయాలలో ప్రజలకు అందుబాటులో ఉన్న డాక్టర్ అని కొనియాడారు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించే దేవుడు డాక్టర్ అని కొనియాడారు. స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, డాక్టర్ సేవలను కొనియాడారు. అతని కుటుంబానికి అన్నివేళల అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోడిశాల రాములు, దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, నంద ఈశ్వర రావు, పిట్టల నాగమణి, ములకల ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండలంలోని సిహెచ్ కొండూరు గ్రామంలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు బొంకం చిన్న గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. రైస్ మిల్ లో ధాన్యం అమ్మితే ప్రభుత్వం ద్వారా వచ్చే 500 రూపాయల బోనస్ రాకపోవచ్చు అని అన్నారు. కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర ఏ గ్రేడ్ కు 2203 బి గ్రేడ్ ధాన్యానికి 2183 రూపాయలు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో పిస్క నారాయణ, డైరెక్టర్ లక్ష్మీనారాయణ, పోశెట్టి, సంతోష్, బరుకుంటసాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

**కోదాడ, విశాలభారతి:** రక్తదానం చేయండి మరొకరికి ప్రాణదాతలుగా నిలబడండి అని ఎంబిఎం ట్రస్టు సభ్యులు అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ విష్ణు హాస్పిటల్ లో తరుణ్ కు అత్యవసరంగా ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం అని డాక్టర్ చెప్పడంతో తెలుసుకున్న ఎంబిఎం గ్రూప్ సభ్యులైన కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన చిన్నపంగు విజయ్ కుమార్ వారి కుమార్తె చిన్నపంగు కాజల్ విజయ్ పుట్టినరోజు సందర్భంగా వారికి బ్లడ్ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలుస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో ఎంతోమందికి రక్తం అందించడానికి సహకరిస్తున్న గ్రూపు సభ్యులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. చిన్నపంగు విజయ్ కుమార్ గత మూడు సంవత్సరాల నుండి వాళ్ళ పాప పుట్టినరోజుని పురస్కరించుకొని ఎంబీఎం ట్రస్టు ద్వారా బ్లడ్ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. వారికి ఎంబిఎం ట్రస్టు సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబిఎం ట్రస్ట్ సభ్యులు మాతంగి సురేష్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కుంటుపడిన మణుగూరు మున్సిపాలిటీ

- పేరు గొప్ప ఊరు దిబ్బలా మణుగూరు మున్సిపాలిటీ
- పాలకవర్గం లేక నిధులు నిల్
- ఎమ్మెల్యే పాయం మున్సిపాలిటీపై దృష్టి సారించాలి




**మణుగూరు, విశాలభారతి** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండో అతి పెద్ద పట్టణం మణుగూరు, పేరుకు పెద్దదే గాని పట్టణంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మణుగూరు పురపాలకానికి 17 ఏళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని స్థానిక నేతలు అంటున్నారు. పట్టణ పురపాలికకు ప్రస్తుతం ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు. మణుగూరు పురపాలకం లో సుమారుగా 20 వార్డులు ఉన్నాయి, పట్టణ జనాభా 50 వేల ప్రజలకు పై చిలుకు ఉంటుంది. స్థానిక అధికారుల పాలన కొనసాగుతుండడంతో పట్టణంలో వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా ఉంది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదు, ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు వాహనాలు మూలన పడ్డాయి. వాటికి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు కనీస ప్రయత్నం కూడా చేయడం లేదు, దీంతో అవి తుప్పు పడుతున్నాయి.
మణుగూరు పాలకమండలి లేకపోవడంతో ఎమ్మెల్యేలు వారి పెత్తనం కొనసాగిస్తున్నారు. వచ్చిన కమిషన్లతో మునిసిపాలిటీ అధికారులు వారి ఇష్టానుసారంగా నడుస్తోంది. ఇంటి పన్నులు ఒకటికి రెండు రెట్లు వసూలు చేస్తున్నారనీ, ఈ ప్రాంతం అభివృద్ధికి ఏమాత్రం నోచుకోవడం లేదనీ ఇంటి పన్నుల విషయంలో చిన్న ఇంటికి పెద్ద ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారనిప్రజలు ఆరోపిస్తున్నారు.
కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మణుగూరును సమగ్ర అభివృద్ధి చేయాలి కానీ ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాన్నే అనుసరిస్తూ నడుస్తోందనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరు మున్సిపాలిటీకి పాలకవర్గం లేక ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు పాలన వ్యవస్థ కొనసాగుతోంది గత ప్రభుత్వం అమలు చేసిన పట్టణ ప్రగతిలో భాగంగా వచ్చే కొద్దిపాటి నిధులతోనే అన్ని పనులు నిర్వహిస్తూ వచ్చారు గత ప్రభుత్వంలో అభివృద్ధి కోసం మంజూరు అయిన నిధులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. నూతన పురపాలక భవన నిర్మాణంతో పాటు పట్టణంలో చేయబోయే అభివృద్ధి పనులకు నిధులు లేవు. మణుగూరు పురపాలకపై కోర్టులో ఉన్న వివాదాన్ని పరిష్కరించి, పాలకవర్గం ఏర్పాటు చేయాలని ఎలక్షన్ నిర్వహించి పాలక మండల నియమించి అందరికీ ఉపయోగపడే విధంగా కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు



# బీజేపీ పట్టణ అధ్యక్షురాలిగా దార కల్యాణి

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి ఆదేశానుసారం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు పట్టి వెంకటకృష్ణ, రాజనిష్ జైన్, దుర్గం అశోక్ ల చేతుల మీదుగా భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలిగా దార కల్యాణిని నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పార్టీ తమపై పెట్టుకున్న నమ్మకాన్ని తప్పకుండా నెరవేస్తానని, పార్టీ పెద్దలందరికీ ధన్యవాదాలు, తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిజెపి నాయకులు సూచించారు.

# జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు



**నల్లగొండ, విశాలభారతి:** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని ఏప్రిల్ 1 నుండి 30 వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి చందనా దీప్తి ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకి సహకరించాలని కోరారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# ఏసు క్రీస్తును స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు

**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలో ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముల్కనూర్, ముత్తారం, గట్ల నర్సింగాపూర్, భీమదేవరపల్లి, కొత్తపల్లి చర్చిలలో ఏసు క్రీస్తును స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తపెల్లి గ్రామంలోని సీయోను ప్రార్థన మందిరంలో ఈస్టర్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సంధర్భంగా చర్చి పాస్టర్ కె. రత్నంబాబు మాట్లాడుతూ మానవాళి పాప పరిహారం కోసం ఏసుక్రీస్తు సిలువపై బలియాగం చేసి మూడవ రోజున తిరిగి లేచిన రోజును ఈస్టర్ పండుగగా క్రైస్తవులు జరుపుకుంటారని తెలిపారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# ప్రేమ, శాంతి, అహింసా మార్గంలో మానవాళి యావత్తూ నడుచుకోవాలి



**పాలకీడు, విశాలభారతి:** శిలువపై మరణించి తిరిగి వచ్చిన మూడో రోజున ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. పాలకీడు మండలం లోని పాలకీడు గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి లో పాస్టర్ పి జాన్ ప్రతాప్ ఈస్టర్ పండుగ గురించి మాట్లాడుతూ సత్యాన్ని సమాధిలో పాతిపెట్టినా అది ఎక్కువ కాలం ఉండదని ఈస్టర్ చెబుతోంది.ఈస్టర్ అంటే జీవితానికి పునర్జన్మ, ప్రేమ, విశ్వాసం, ఆశలు. ఇది యేసుపై మన విశ్వాసాన్ని పెంచుతుంది. ప్రాణత్యాగం చేసిన ఏసు క్రీస్తు మూడో రోజే సజీవుడై తిరిగొచ్చిన పవిత్ర దినం ఈస్టర్.సత్యం పట్ల విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్.ప్రేమ, శాంతి, అహింసా మార్గంలో మానవాళి యావత్తూ నడుచుకోవాలన్న క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి.ఈ ఈస్టర్ మీకు నూతన విశ్వాసం, ఆశ , ప్రేమను తీసుకురావాలి.ఏసు ప్రేమ , త్యాగం గురించి ప్రతిబింబించే సమయం ఇతరులకు సేవ చేయడానికి మీకు స్ఫూర్తినివ్వాలి అని,దేవుని దయతో అందరి హృదయాల్లో శాంతి, ఆనందాలు నిండాలని ఈస్టర్ గ్రీటింగ్స్ చెప్పారు. ఈ కార్యక్రమం లో సంఘ పెద్దలు మాతంగి యేసు రత్నం, సామూయేలు, మార్కయ్య, లాజర్,నాగరాజు, రాము, సల్మాన్ , మరియు, పిల్లలు, ఇతరులు పాల్గొన్నారు.



# వడ్డెరులను గుండెల్లో పెట్టి చూసుకుంటాం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, విశాల భారతి:** రాష్ట్రంలో ఉన్న వడ్డెర జాతి, వారి సమస్యల కోసం కృషి చేస్తానని, అలాగే వాళ్ళని గుండెల్లో పెట్టి చూసుకుంటానని ఎమ్మెల్యే మేఘా రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తి పట్టణంలోని దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే , నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర జాతి కులాస్తులందరినీ గుండెల్లో పెట్టి చూసుకుంటామని ఎవరు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి మాట్లాడుతూ ..వడ్డెర కులస్తులకు కేంద్రంలో కాంగ్రెస్ అధికారం వచ్చిన వేంటనే వారి సమస్యలన్నీ పరిష్కరిస్తా అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తిరి గణేష్ ,రాష్ట్ర వైస్ చైర్మన్ కుంచపు దేవరాజ్ బాలరాజ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లులను మూసివేయాలి

- రాఘవేంద్ర,మల్లికార్జున రైస్ మిల్లుల ముందు కాలనీవాసులు ధర్నా

**నేరేడుచర్ల ,విశాలభారతి**: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఉన్న రాఘవేంద్ర,మల్లికార్జున రైస్ మిల్లులు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని ఆరోపిస్తూ,మిల్లుల ముందు కాలనీవాసులు ధర్నా చేసి వాటిని మూసివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని జాన్ పహాడ్ రోడ్డులో గల మిల్లుల నుంచి వెలువడే దుమ్ము,ధూళి వల్ల ప్రజలకు ముఖ్యంగా చిన్నారులు అనారోగ్యంతో బాధపడుతు, వృద్ధులకు ఆస్తమాతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కాలనీవాసులు ఆదివారం రైస్ మిల్లుల ముందు ఆందోళనకు దిగారు.రైస్ మిల్లుల నుండి వెలువడే కాలుష్యముతో రోగాలు వచ్చి ఆస్పత్రి పాలవుతున్నామన్నారు. గతంలో రైస్ మిల్లుల యజమానులకు కాలుష్యం మరియు తీవ్రమైన ఆరోగ్య సమస్యల గురించి మేము తెలియజేసాము.మేము పదేపదే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. యజమానులు మరియు ఉన్నతాధికారులు నియంత్రించడానికి ఎటువంటి చర్యలుతీసుకోలేదన్నారు. మేము నిరసన చేయడం తప్ప వేరే మార్గం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆందోళనలో చెందుతున్నారు. ప్రజా ఆరోగ్యానికి నష్టం కలిగిస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.రోడ్డుపై వెళ్లే వాహనదారుల కళ్ళల్లో దుమ్ము, ధూళి పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ధర్నా చేస్తున్న మహిళలపై మిల్లుల యాజమాన్యం దౌర్జన్యం చేయటం దారుణమన్నారు.ఈ ధర్నాలో ఆకారపు వెంకటేశ్వర్లు,చేపూరి మాలాద్రి, ప్రభాకర్ రెడ్డి,గడ్డం సతీష్ రెడ్డి,తాడొజూ శ్రీనివాసులు,ప్రభాకర్ రెడ్డి,రమణమ్మ,సరిత,నందిని,గడ్డం మమత, తదితరులు పాల్గొన్నారు



# ఈస్టర్ క్రైస్తవులకు అతి పెద్ద పండుగ

**సిరికొండ, విశాల భారతి:** సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో జె ఎల్ ఎఫ్ జి చర్చిలో పాస్టర్ యేసు రత్నం, ఆహారోన్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ యేసు రత్నం మాట్లాడుతూ.... ఈస్టర్ క్రైస్తవులకు అతి పెద్ద పండుగని, ఇది వసంత ఋతువులో వస్తుందని,ప్రభువైన క్రీస్తు పరమపదించిన మూడు రోజుల తర్వాత అంటే ఆదివారం నాడు ఆయన మళ్ళీ ప్రాణాలతో వచ్చారాని,దీంతో ప్రజలు హర్షోల్లాసం ప్రకటించి ఆనందంలో మునిగి తేలియాడారాని అన్నారు. ఈ వేడుకలో పాస్టర్లతో పాటు క్రైస్తవ సోదరులు, ది హోప్ యూత్ సభ్యులు ప్రశాంత్ మోజెస్, డేవిడ్ పాల్, హెబెల్, వినెక్ తదితరులు వున్నారు.

# ఆర్థిక సహాయం అందజేత

- మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి



**ధర్పల్లి, విశాల భారతి:** ఇందల్వాయి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మాదిగ రంజిత్ భార్యాభర్తల కాళ్ళు విరిగిపోవడంతో వారికి ఆర్థిక సాయంగా మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి పదివేల రూపాయలు ఇవ్వడం జరిగింది. మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి పదవులు ఆయన ఆశయం కాదని, ప్రజల మనసులో ఉండడం ఆయన లక్ష్యంగా ప్రజలు భావిస్తుంటారు. పదవిలో లేకున్నా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆయనే ఆపద్బాంధవుడిల ఆదుకుంటు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని మాట్లాడుకుంటున్నారు.



# బిజెపి పట్టణ కమిటీ ఎన్నిక

**మందమర్రి టౌన్, విశాల భారతి:**బిజెపి మందమర్రి పట్టణ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్ ఆదేశాలతో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా కార్యాలయంలో భారత జనతా పార్టీ నూతన మందమర్రి పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో ఎన్నికైన వారికి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ నియామక పత్రాలను అందజేశారు. ఎన్నికైన వారిలో వాణిజ్య సెల్ విభాగం మండల అధ్యక్షులుగా బొడ్ల భూపతి, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా అట్టెం భీమ్, మందమర్రి పట్టణ ఉపాధ్యక్షులుగా తుపాకుల శ్రీనివాస్, దాసరి నర్సింగ్, కార్యదర్శులుగా పిట్ట రాజమౌళి, రామ్ కిష్టయ్య, ములుమూరి రమేష్, బైరి శ్రీనివాస్, ఎర్రోజుల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా పట్టణ ఉపాధ్యక్షులుగా మెరుగు తిరుపతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డివి దీక్షితులు, మందమర్రి పట్టణ అధ్యక్షులు మార్త కుమారస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొలాలు పరిశీలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

**తుంగతుర్తి, విశాలభారతి:** వెలుగుపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పైర్లను మాజీ ముఖ్యమంత్రి గులాబీ దళపతి కేసీఆర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిపోయిన పంట పొలాలను చూసి రైతుల కోసం చూసి కేసీఆర్ చెల్లించి పోయారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పంట పొలాలు ఎండిపోయిన తీరును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు వివరించారు. గడిచిన ఐదారు సంవత్సరాలుగా గోదావరి జిల్లాలో రాకతో తుంగతుర్తి ప్రాంతమంతా సస్య శ్యామలంగా ఉందని చెరువులు కుంటలు గోదావరి జలాలు తో నిండిపోయాయని పంటలు పుష్కలంగా పడ్డాయని రైతులు తెలిపారు. ఈ సంవత్సరం గోదావరి జలాలు రాక చెరువులలో కుంటాలలో నీరు చుక్క లేకుండా పోయాయని దీంతో బావులు బోర్లు ఎండిపోయి వేసిన వరి నాట్లు అన్ని ఎండిపోయానే తెలిపారు. ఎండిపోయిన పంట పొలాలు తీరును రైతులు తెలుపుతుంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెల్లించి పోయారు. పలువురు మహిళా రైతులు పంటలు ఎండిపోవడంతో తమ ఎలా జీవించాలని తమని ఆదుకునే వారు ఎవరాని కెసిఆర్ తో మొరపెట్టుకున్నారు. గడిచిన ఐదారు సంవత్సరాలుగా ఎస్పి రెస్పి కాలువల్లో నిండుగా నీరు వచ్చిందని



నేడు గోదావరి జలాలు రాక కాలవోలు వెలవలపోతున్నాయని రైతులు ఆవేదనతో తెలిపారు. వ్యవసాయబావులకు కరెంటు కూడా సక్రమ రావడంలేదని రైతులు తెలిపారు. రైతుల గోస విన్న కేసీఆర్ రైతులు అధర్యం పడవద్దు అని 24 గంటల విద్యుత్తు తిరిగి తెచ్చుకుందామని మళ్లీ గోదావరి జలాలు కాలవల్లో నిండుగా ప్రవహించేలా ఉద్యమిద్దమని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అన్నదాత కు అండగా ఉంటుందని రైతులు ఎవరు కూడా ఆత్మ శర్యాన్ని కోల్పోవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో కెసిఆర్ వెంట మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యుడు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ఎమ్మెల్యేలు పళ్ళ రాజేశ్వరి రెడ్డి,గుజ్జ యుగంధర్ రావు తో పాటు పలువురు మాజీ శాసనసభ్యులు రాష్ట్ర నాయకులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



# ఎండిన పొలం.. పశువులకు గ్రాసం

**భీమదేవరపల్లి, విశాల భారతి:**యాసంగిలో సాగు చేసిన వరి పంటకు నీరందక పశువులు, గొర్రెలకు గ్రాసంగా మారుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పండిస్తున్న వరికి సాగునీరు లేక బీటలు వారుతున్నాయి. ప్రధానంగా బావులు, బోర్లలో నీరు లేకపోవడంతో చేసేదేమీ లేక వరి పంటలను వదిలేస్తున్నారు. వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టి పంట చేతికొచ్చే దశలో ఇలా పశువుల పాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.



# ఏసుక్రీస్తు ముప్పైమూడున్నర ఏళ్లు మనుషుల మధ్య జీవించాడు

**మందమర్రి టౌన్, విశాల భారతి:** ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సిలువ ఊరేగింపుతో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. గుడ్ ఫ్రైడే రోజు సిలువ త్యాగ మరణం పొందిన మహోన్నతుడైన ఏసుక్రీస్తు మూడో రోజు ఆదివారం సజీవుడై లేచిన రోజే ఈస్టర్ పర్వదినమని సియస్ఐ చర్చి పాస్టర్ రెవ.జెర్మియా అన్నారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గల సియస్ఐ చర్చిలో ఆదివారం తెల్లవారు జమున నుంచే సిలువ వెలిగింపు కార్యక్రమాన్ని ఉమెన్స్ ప్రెసిడెంట్ సంధ్యతో కలిసి, ఉమెన్స్ సెక్రెటరీ రీటారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవ.జెర్మియా సందేశమిస్తూ పాపుల రక్షణార్థం ఏసుక్రీస్తు సిలువ మోసి తన రక్తాన్ని చిందించి ఈ లోకాన్ని శుద్ధి చేసేందుకు రక్షణగా నిలిచారన్నారు. ఏసుక్రీస్తు ముప్పైమూడున్నర ఏళ్లు ఈ లోకంలో మనుషుల మధ్య జీవించి అనేక మహిమలు, అద్భుతాలు చేశారని గుర్తుచేశారు.

# ఆసుపత్రి కార్మికుల వేతనాల బడ్జెట్ విడుదల

- **హర్షం వ్యక్తం చేసిన ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు**

**వనపర్తి, విశాల భారతి:**తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాల బడ్జెట్ విడుదల అయ్యిందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న జిల్లా ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు చెల్లించాల్సిన అర్ధ సంవత్సర పెండింగ్ వేతనాలను ఉగాది, రంజాన్ లాంటి పర్వదినాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ కి ఏప్రిల్ ఒకటి నుండి రాష్ట్రవ్యాప్త ఆస్పత్రి కార్మికుల నిరవధిక సమ్మె డిమాండ్ నోటీస్ అందజేయడం జరిగింది. 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రిలో రోజుకు ఒక గంట పాటు వివిధ రూపాలలో ఆందోళనలు కార్మికులు చేపట్టారని అన్నారు. ఇందులో భాగంగా టీవీవిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ జోక్యం చేసుకొని యూనియన్ ప్రతినిధులతో కార్మికులతో రెండు మూడు దఫాలుగా చర్చలు జరిపి సమ్మెకు వెళ్లొద్దని



చెప్పారని అన్నారు. కానీ యూనియన్ నాయకులు జీతాలు చెల్లిస్తేనే సమ్మె విరమిస్తామని చెప్పడంతో కమిషనర్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి కార్మికులకు రావాల్సిన ఐదు నెలల పెండింగ్ వేతనాల బడ్జెట్ ను తక్షణమే విడుదల చేశారని అన్నారు. కార్మికుల సంక్షేమ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాల బడ్జెట్ ను విడుదల చేసిందని కనుక ఏప్రిల్ ఒకటి నుండి నిర్వహించబోయే నిరవధిక సమ్మె విరమిస్తున్నామని అన్నారు.



# ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించిన వేణురాజ్

**బాల్కొండ, విశాల భారతి:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో గత నాలుగు రోజుల నుండి కొనసాగుతున్న క్రీడా పోటీలలో ఆదివారం నిజామాబాద్ జిల్లా నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వేణురాజ్ పాల్గొన్నారు. యూనివర్సిటీ గ్రౌండ్ లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్యుఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఎన్ఎస్యుఐ అధ్యక్షులు,కమిటీకి సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, క్రీడలు అనేవి సోదరభావంతో ఉండాలని అన్నారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం విద్య వ్యవస్థను నాశనం చేయడం జరిగిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్ఎస్యుఐ విద్యార్థి సంఘం విద్యార్థుల పక్షాన ప్రజల పక్షాన పోరాటం చేయడం జరిగింది అని అన్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేసే దిశగా తమ కార్యచరణను ప్రకటించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు కోమిర శ్రీశైలం, నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్యుఐ ఉపాధ్యక్షులు నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరికలు

**సిరికొండ, విశాల భారతి:**సిరికొండ మండలం కొండూరు గ్రామ పెసరు గుట్ట తాండలోగల బిఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి నివాసంలో కాంగ్రెస్ లో చేరడం జరిగిందని కొండూరు యువజన అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్షన్ సమయాన కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు చెప్పిందో అవి తూచ తప్పకుండ పథకాలని అమలుపారుస్తుంది కాబట్టే ప్రజలు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్లో చేరిన వ్యక్తులలో తిరుపతి నాయక్, లక్ష్మణ్ నాయక్, హరి నాయక్, గణపతి నాయక్, మైపాల్ నాయక్, నవసిలాల్, గణేష్ నాయక్, మోహన్ నాయక్, భాస్కర్ నాయక్, రాజేశ్వర్ నాయకులు ఉన్నారు.

# విద్యార్థి పాండేకి ప్రీమియర్ సిఓఈలో సీటు

**బెల్లంపల్లి, విశాల భారతి:**సెయింట్ మేరీ పాఠశాల బెల్లంపల్లి విద్యార్థి ప్రథం పాండే ప్రతిష్టాత్మకమైన సిఓఈ లో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ జిన్ని కొరియన్ తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సిఓఈ)లలో వచ్చే విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ అడ్మీషన్స్ కోసం రెండు దశల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలను సంస్థ శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో సెయింట్ మెర్రీ బెల్లంపల్లి విద్యార్థి విజయ దుందుభీ మోగించారు. ఏకంగా జనరల్ క్యటగిరిలో సీటు సాధించి తమ సత్తాను చాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రీమియర్(స్టేట్)సిఓఈ లైన షేక్ పేట సిఓఈలో అడ్మిషన్లకై విడుదలచేసిన ఫలితాల్లో సీటు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తీవ్రమైన



పోటీని నెగ్గుకొని సీటు సాధించి తమ సత్తా చాటడం అభినందనీయమని ప్రిన్సిపల్ అభినందించారు.




# సిఐ, ఎస్సైకి సన్మానం చేసిన గౌడ కులస్తులు

**ధర్పల్లి, విశాల భారతి:**ధర్పల్లి నూతన సీఐ భిక్షపతి, ఎస్సైగా విక్రమ్ పదవి బాధ్యతలు స్వీకరించిన సంధర్భంగా గౌడ సంఘం సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ బిక్షపతి మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని సీఐ, ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్,గౌడ సంఘం అధ్యక్షుడు నిమ్మల గంగాధర్ గౌడ్ ప్రవీణ్ గౌడ్,దేవేందర్, లాలాగౌడ్ శ్రీను, రమేష్ గౌడ్,నర్సాగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పవిత్రతకు రంజాన్ మాసం ప్రతీక

- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి, విశాల భారతి:**రంజాన్ మాసంలో మైనార్టీ సోదరులు పవిత్రతకు మారుపేరుగా రంజాన్ మాసంలో ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జామ మసీద్, మహమ్మదీయ మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు, మసీద్ ఇమామ్ లకు ఖర్జూరలు, పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీలు సోదర భావంతో అందరితో కలిసి మెలిసి ఉంటారని, వారందరికీ ఆదర్శంగా నిలుస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ మియా, అక్తర్, అనీష్, ఎండి బాబా, మసీద్ పెద్దలు మునురుద్దీన్, అల్తా నజీర్, కృష్ణ, కిరణ్ కుమార్, కోట్ల రవి, రాగి వేణు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సి మోర్చ జిల్లా అధ్యక్షులు రమేష్ కు సన్మానం

- **ఎంపి అభ్యర్థి గెలుపుకు కృషి**

**బెల్లంపల్లి, విశాల భారతి:**భారతీయ జనతా పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు కోడి రమేష్ బిజెపి ఎస్సి మోర్చ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయనను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బిజెపి నాయకులు బెల్లంపల్లి లోని బిజెపి కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి లోని బిజెపి కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి మాట్లాడుతూ.. కోడి రమేష్ ఎస్సి మోర్చ జిల్లా అధ్యక్షులుగా పదోన్నతి పొందడం హర్షదాయకం అన్నారు. జిల్లాలో దళితుల్ని బిజెపిలో చేర్పించి పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలనీ కోరారు. ఎంపి అభ్యర్థి గెలుపుకు కృషి భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులుగా పోటీ చేస్తున్న గోమాస శ్రీనివాస్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, ఎస్సి మోర్చ జిల్లా అధ్యక్షులు కోడి రమేష్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజులాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లోకి మొదలైన చేరికల పర్వం

- **కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న 8 మంది కౌన్సిలర్లు**

**వనపర్తి, విశాల భారతి:** నాలుగేళ్ల పాటుగా కౌన్సిలర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా, ఓర్పుతో, సహనంతో ఉన్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు విసిగిపోయి, బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిలు అన్నారు. వనపర్తి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు 8 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో పుట్టపాక మహేష్, పాకనాటి కృష్ణ, నక్క రాములు, జంపన్న యాదవ్, భువనేశ్వరి, చంద్రకళ, సత్యమ్మ, భాష నాయక్ లు ఎమ్మెల్యే మేఘా రెడ్డితో పాటు... పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి సమక్షంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ నుంచి నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచానని తనను వనపర్తి నియోజకవర్గంలోని ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ ... ఎన్నో కష్టనష్టాలకు ఓర్చు వనపర్తి ప్రజలు తనను 25వేల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించారని అదే తరహాలో వనపర్తి నియోజకవర్గం నుంచి 50వేల మెజారిటీ ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చందర్, కౌన్సిలర్లు వెంకటేష్, విభూది నారాయణ, సత్యం సాగర్, జయసుధ మధు, లక్ష్మీ రవి యాదవ్, సుమిత్ర యాదగిరి, బ్రహ్మం చారి, బండారి రాధాకృష్ణ, నాయకులు లక్కాకుల సతీష్,తదితరులు పాల్గొన్నారు.



# సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పది

- **గౌరవంగా పదవి విరమణ పొందడం గొప్ప అదృష్టం...**

**చిగురుమామిడి, విశాల భారతి:**సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని,గౌరవంగా పదవి విరమణ పొందడం గొప్ప అదృష్టమని ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి సభ్యుడు గీకురు రవీందర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం దోమ లింగారెడ్డి ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంను వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిపి కొత్త వినీతారెడ్డి, జెడ్పిటిసి రవీందర్ లు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఒక ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషిచేసి పదవి విరమణ పొందడం సంతోషదగ్గ విషయం అన్నారు. 35సంవత్సరాలలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా లింగారెడ్డి తీర్చిదిద్దారని గుర్తు చేశారు.మైసంపల్లి, బత్తులపెల్లి, కొత్తపల్లి, గౌరవెల్లి, పొట్లపల్లి, గంభీరావుపేట చిగురుమామిడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించానని తనకు సహకరించిన అందరికీ లింగారెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం దోమ లింగారెడ్డి శకుంతల దంపతులను శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి కుమారులు స్పందన్ రెడ్డి, అనురూత్ రెడ్డి లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ గాదే రఘునాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన సునీల్ కుమార్

**బాల్కొండ, విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం ముప్కాల్ మండలంలో బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పలు బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన తోఫారం మహేష్ తండ్రి మల్లయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించారు.వారి కుటుంబాన్ని పరామర్శించి, సంతాపాన్ని తెలిపి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే గొల్ల మహేష్ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు.
కుమ్మరి గంగారం,వెంచిర్యాల్ గ్రామానికి చెందిన పాసపు శ్రీనివాస్ తల్లి ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు,విశాలభారతి:**
రంజాన్ మాసం సందర్భంగా పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలోని మదీనా మసీదులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోరె మియా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరైయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం స్వయంగా ముస్లిం సోదరులకు భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మతసామరస్యానికి ప్రతిక అని చెప్పారు.

**హోరేబ్ హోలీ చర్చిలో ఈస్టర్ వేడుకలు..**
అమీన్ పూర్ మున్సిపాలిటీ మల్లికార్జున హిల్స్ కాలనీ హోరేబ్ హోలీ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఈ వేడుకల్లో పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులందరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.



## చలివేంద్రం ఏర్పాటు పుణ్యఫలం

- **అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి:** వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పుణ్యఫలమని అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని కెసిఆర్ సర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం చైర్మన్ పాండురంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** పెద్దఅంబర్‌పేట్ శాంతినగర్ కాలనీలోని కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే నూతన దుస్తులు ధరించి చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సిల్వధర్ క్రీస్తు పునరుత్థానం గురించి భక్తులకు తెలియజేశారు. సర్వ మానవుల రక్షణార్థమై క్రీస్తు సిలువపై రక్తం చిందించాడని, సిలువ వేయబడిన మూడో దినమున మరణాన్ని గెలిచి తిరిగి లేచాడని, ఈ పవిత్రమైన రోజునే ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నామని తెలిపారు.

## ఎస్సారెస్పీ జలాలను విడుదల చెయ్యాలి

- **రైతుల పంటలను కాపాడాలి.**
- **నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి.**

**కురవి,విశాలభారతి:** మహబూబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం కురివి మండలంలో బోర్లు, బావులలో నీరు అడుగంటి పోవడంతో రైతులు వేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి గ్రామ శివారులో ఎండి పోయిన పంట పొలాలను సిపిఐ బృందం నల్లు సుధాకర్ రెడ్డి, కరణం రాజన్న, తురక రమేష్ మాట్లాడుతూ.. వందలాది ఎకరాలలో తీవ్ర నీటి ఎద్దడి వలన ప్రభుత్వం సరైన సమయంలో స్పందించక పోవడంతో నోటి దగ్గరకొచ్చిన పంటలు ఎండిపోయాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ జలాలచే చెరువులను కుంటలను నింపి రైతుల పంటలను సంరక్షించాలని డిమాండ్ చేశారు. ఎండి పోయిన పంటలను వ్యవసాయ అధికారులు సర్వే చేసి పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తాగునీటి ఎద్దడిని నివారించాలి. పాలేరు రిజర్వాయర్లు నీరు అడుగంటి పోవడంతో మిషన్ భగీరథ నీళ్లు వచ్చే అవకాశం లేనందున ముందు జాగ్రత్తగా ప్రభుత్వం తాగునీటి ఎద్దడిని నివారించడానికి గ్రామాలలో బావులను, బోర్లను,మోటార్లను మరమ్మతులు చేయించి తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరారు

# భారీ మెజార్టీతో పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలి

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**



**ఎల్బీనగర్ ,విశాలభారతి:** రానున్న మల్కాజిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం చంపాపేట్ లోని కొత్త కాపు యాదవ రెడ్డి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన మల్కాజిరి పార్లమెంటరీ కార్యకర్తల ముఖ్య సమావేశం టీపీసీసీ కార్యదర్శి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అధ్యక్షన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరావు మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిరి పార్లమెంట్ పట్ల పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తి అని, ఇక్కడి నుండి గెలుపొంది నేడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్నారంటే ఎల్బీనగర్ ప్రజల ఆశీస్సులేనని వెల్లడించారు.
రేవంత్ రెడ్డికి ఏ విధంగా అయితే ఎల్బీనగర్ ప్రజలు మద్దతు తెలిపారో అదేవిధంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి కి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి గిఫ్టుగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని, అలాగే ఎంపీ అభ్యర్థిని కూడా గెలిపించాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గంతో పాటు మల్కాజిగిరిలో ఉన్నటువంటి మరో ఆరు నియోజకవర్గాలు అభివృద్ధి జరగాలంటే మల్కాజిరిలో పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి, జక్కగిరి ప్రభాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, లింగాల నాగేశ్వరరావు, గజ్జి భాస్కర్ యాదవ్, గజ్జి శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు శాలిని ఈశ్వరమ్మ యాదవ్, వజీర్ ప్రకాష్ గౌడ్, , డివిజన్ అధ్యక్షులు, పాల్గొన్నారు. మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా..ఎంపీగా పోటీ చేస్తున్న ఆశీర్వదించండి

- **శీనన్న నేను రామలక్ష్మణులుగా ముందుకు పోతాం**
- **ఇంటి బిడ్డగా దీవించండి..ఎంపీగా గెలిపించండి**
- **కాట శ్రీనివాస్ గౌడ్ తల్లి ఆశీస్సులు తీసుకున్న నీలం మధు ముదిరాజ్**



**పటాన్ చెరు,విశాలభారతి:**
అమ్మా..నేను మీ బిడ్డనే మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నా నన్ను ఆశీర్వదించండి.. అంటూ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మాతృమూర్తి కాట భారతమ్మకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం అశోక్ నగర్ లోని కాట శ్రీనివాస్ గౌడ్ నివాసానికి నీలం మధు వెళ్లారు. ఆ సమయంలో కాట శ్రీనివాస్ గౌడ్ అందుబాటులో లేకపోవడంతో ఆయన తల్లి భారతమ్మను కలిశారు. తను దీవించాలని.. శీనన్న తాను రామలక్ష్మణులుగా ముందుకు సాగుతామని ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం తనకు టిక్కెట్ కేటాయించిందన్నారు. ఇందిరా గాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటులో ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియా గాంధీ గారికి బహుమానంగా ఇవ్వాల్సిన బాధ్యత మన పైన ఉందన్నారు. నన్ను సైతం మీ ఇంటి బిడ్డగా భావించి ఈ ఎన్నికల్లో తనకు పూర్తి మద్దతు ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ ఎంపీగా నీలం మధు విజయం సాధించాలని ఆమె ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టి యుసి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోల్కూరి నరసింహారెడ్డి, డిసిసి కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, అమీన్ పూర్ కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్, నారాయణ రెడ్డి, మాజి సర్పంచ్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



## కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆడిషినల్ కంట్రోలర్ గా ప్రొ.అచ్చ కృష్ణంరాజు

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం టెక్నాలజీ కళాశాల కెమిస్ట్రీ విభాగం ప్రొ. కృష్ణంరాజు కీలకమైన బాధ్యతలు స్వీకరించారు. ప్రొ. కృష్ణంరాజు గతంలో నిజాం కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్, ఓయూ పరీక్షల విభాగం బీఏ, బి.ఎస్సి ఆడిషినల్ కంట్రోలర్ గా, పని చేశారు. ఓయూ పరీక్షల విభాగం కాన్ఫిడెన్షియల్ విభాగం ఆడిషినల్ కంట్రోలర్ గా నియమితులయ్యారు. పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు.



## అవినీతి పరులకు కాంగ్రెస్ పార్టీలో చోటు లేదు

- **తోటకూర జంగియ్యా యాదవ్.**

**విశాలభారతి,కీసర :** కీసర ఎంపిపి మాల్లారపు ఇందిరా లక్ష్మి నారాయణ,అంకిరెడ్డి పల్లీ ఎంపిటిసి పండుగ కవిత త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఆదివారం చిర్యాల గ్రామంలోని ఎంపిపి నివాసంలో మల్లారపు ఇందిరా లక్ష్మి నారాయణను అలాగే అంకిరెడ్డి పల్లీ ఎంపిటిసి కవితను కలిసిన కాంగ్రెస్ పెద్దలు.మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ ఇంచార్జ్ తోటకూర జంగయ్య యాదవ్,నక్క ప్రభాకర్ గౌడ్ కలిసి ఎంపిపి ఇందిరా ఎంపిటిసి కవితతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఎంపిపి,ఎంపిటిసికి ఎలాంటి ఇబ్బందీ లేదని కాంగ్రెస్ పెద్దలకు చెప్పారు. ఈ నెల 6 వ తేదీన మండలంలో కాంగ్రెస్ పార్టీ సమావేశంలో చేరనున్నారు.ఈ సంధర్భంగా తోటకూర జంగయ్య యాదవ్ మాట్లాడుతూ పార్టీలోకి అందరూ రావచ్చు కానీ వచ్చిన విధంగా వారికి ప్రియరిటీ ఉంటుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీకి పని చేసినవారికి ముందుగా గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యంగా అవినీతి పరులకు కాంగ్రెస్ పార్టీలో చోటు లేదు అని అన్నారు. కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి కృపతో మండలంలో ఎంపి ఎన్నికల ప్రచారం త్వరలో నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ళ కృష్ణ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి,కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, బర్లపటి జయరామ్,పొలగొని సంతోష్ గౌడ్,ధర్మేందర్ మండలంలోని ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర జేఏసీ గా ఏర్పడిన వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులు

**సికింద్రాబాద్, విశాలభారతి:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. వీరు సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేదికగా ద్వారా రానున్న రోజుల్లో వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొ.సిపి వర్ధని పదవీ విరమణ

- **బోధన, పరిశోధన, అకడమిక్ గా సత్తా చాటుకున్నారు**
- **ప్రొ.లింబాద్రి**



**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్రం (ఫిజిక్స్ ), సీనియర్ ప్రొపెసర్ ప్రొ. చుందూరు పర్వత వర్దని బోధన, పరిశోధనలో అకడమిక్ గా ఇలా అన్ని రంగాల్లో రాణించిన గొప్ప ప్రొపెసర్ అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. ఆర్.లింబాద్రి కొనియాడారు. ప్రొ.సీపీ వర్దని పదవీ విరమణ సందర్భంగా ఇటు ఫిజిక్స్ విభాగంలో అటు ఓయూ వీసీ ఆమెను ఘనంగా సన్మానించారు. కోఠి ఉమెన్స్ కాలేజ్ కి , ఓయూ ఫిజిక్స్ విభాగానికి ,పరిక్షల విభాగంలో ఆమె సేవాలు ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్టర్ ప్రొ.లక్ష్మీ నారాయణ లు ప్రశంసించారు. కోఠి ఉమెన్స్ కాలేజ్ ఫిజిక్స్ హెడ్ గా మైక్రో వైవ్స్ అభివృద్ధి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ , ఎన్సీసి ఆఫీసర్ గా,సైన్స్ కాలేజ్ ప్లేస్ మెంట్స్ సెల్ ఆఫీసర్ గా, స్టూడెంట్స్ అడ్వైజర్ గా విశేష కృషి చేశారు. ఇక ఓయూ పరీక్షల విభాగం ఆడిషినల్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కంట్రోలర్ గా ఆమె హయాంలో 2,200 పీహెచ్డీ లు జారీ చేసి చరిత్ర సృష్టించారు. 12 దేశాలాలో పర్యటించారు. ఆమె జాతీయ అంతర్జాతీయ సెమినార్స్ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ప్రొ.వర్దని తన గురువులు, తల్లిదండ్రులు, కుటుంబం సభ్యులు, సహా ప్రొపెసర్స్ కు, విద్యార్థులకు కృతజ్ఞతలు చెప్పారు.





## ఎండిపోయిన మున్నేరు

- **రైతన్న కండ్ల కన్నీరు**
- **పాకాల మున్నేరు వాగును నమ్ముకొని వరి పంట వేసుకున్న రైతులు.**
- **ఏసంగి సాగుకు నీటి ఎద్దడి తో రైతు కన్నీరు**
- **చెరువులో నీరు అడుగంటగా చెరువు కుంటలో కరెంటు మోటర్లు**
- **ఎండిపోతున్న పంటను చూసి ఆందోళనలో రైతన్నలు.**

**కురవి,విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని కోన్ని గ్రామల రైతులు పాకాల చెరువుని నమ్ముకొని చెరువు కింద వందల ఎకరాల పొలాలు నాటు పెట్టుకున్నారు. ప్రస్తుతం మున్నేరు వాగు పూర్తిగా ఎండిపోవడంతో పొలాల పారకం రైతులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వం నీటిని విడిచి పంట పొలాలను కాపాడాలని వేడుకుంటున్న రైతులు... ప్రతి సంవత్సరం నీటి వరదలతో పచ్చని పైర్లు పండే చోట వాగుల్లో వంపుల్లో నీరు లేక నెర్రలు బాసి ఉన్నాయి. పొలం మడికట్లు ఎండుతున్న వరి పంటలే దర్శనమిస్తున్నాయి. పాకాల చెరువు కింద పూర్వము నుండి గ్రామ ప్రజలు వందల ఎకరాలు సాగుచేస్తున్నారు. ఇప్పుడు ఎండిన పాకాల చెరువులో వంద ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మహబూబాబాద్, కురవి, బయ్యారం, గార్ల, డోర్నకల్, చుట్టుపక్కల అన్ని ప్రాంతానికి ఈ మున్నేరు వాగుతోనే పంట పొలాలు పండేది. కానీ ఆకల చెరువు ఎండి పోవడంతో మున్నేరు వాగులో నీళ్లు లేక రైతన్నల గొంతు ఎండి పాయే. మున్నేరు వాగులో రైతులు గోసతో బావులు తెగించి గుంటలు తవ్వి తీస్తున్న నీళ్లు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు నీరు ఇచ్చి పంటలను కాపాడాలని కోరుకుంటున్న రైతులు. ఎండి పోతున్న పంటలను చూసి రైతులు నీటిని అందించి ఆదుకోవాలని రైతుల గుండెలోని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నోటికొచ్చిన వరి పంట నీళ్లు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి రైతులు కన్నీరు పెడుతున్నారు. ఇప్పటికైనా రైతుల బాధలకు స్పందించి అధికారులు నాయకులు చొరవ చూపాలని రైతులని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



## జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

- **క్రీడారంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**
- **తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి:** క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూర్యాపేట బాస్కెట్ బాల్ క్లబ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించి మాట్లాడారు.మానసిక దృఢత్వానికి శారీరక బలోపేతానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు.క్రీడారంగ అభివృద్ధికి బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. త్వరలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలను ఏర్పాటు చేయడంలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో బాస్కెట్ బాల్ ఎంతో ప్రాచుర్యం పొందిందని దేశంలో కొంత ఆదరణ తక్కువగా ఉందని, క్రీడాకారులు బాస్కెట్బాల్ పోటీలో విశేషంగా రాణించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఫారూఖ్,గట్టు శ్రీను, షఫీఉల్లా,వెలుగు వెంకన్న,ఎడ్ల వీరమల్లు,తండు శ్రీను, ధర్మ,సూర్యాపేట బాస్కెట్ బాల్ క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# నితిన్ బర్త్ డే స్పెషల్ 'రాబిన్‌హుడ్' పోస్టర్



హీరో నితిన్ తనకు బ్లాక్ బస్టర్ 'భీష్మ' అందించిన దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో చేస్తున్న'రాబిన్‌హుడ్' చిత్రంతో ప్రేక్షకులని అలరించడానికి రెడీ అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ హ్యూమరస్ యాక్షన్ అడ్వెంచర్ టీజర్‌లో నితిన్ దొంగగా కనిపించారు. వెంకీ కుడుముల నితిన్ పాత్రను చాలా యూనిక్ ప్రజెంట్ చేశారు. నితిన్ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భంగా, రాబిన్‌హుడ్ మేకర్స్ సరికొత్త పోస్టర్‌తో ముందుకు వచ్చారు. సినిమాలో ట్రెండీ లుక్ లో కనిపించిన నితిన్ బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో తన అన్ బిటబుల్ స్టైల్‌ని చూపించారు. బ్లూటూత్ డివైజ్ లో మాట్లాడుతూ, గ్రేస్ ఫుల్ గా నడుస్తూ కనిపించారు. నితిన్ ప్యాంట్ పాకెట్స్‌లో గన్స్ కూడా వున్నాయి. అతను ఏజెంట్ లాగా ఉన్నాడు. టీషర్టుపై ఏజెంట్ RH (రాబిన్‌హుడ్) అని రాసుంది. బ్లాక్ షేడ్స్, వాచ్‌తో పోస్టర్ అద్భుతమైన స్వాగ్ తో కనిపించారు నితిన్. ఇది నితిన్ అభిమానులకు ప్లజంట్ సర్ ప్రైజ్ ఇచ్చింది.

## 'లవ్ మీ' చాలా కొత్త ప్రయత్నం.. 'రావాలిరా' సాంగ్ లాంచ్ : దిల్ రాజు



టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం 'లవ్ మీ'. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వాన్ని వహించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమా నుంచి టీజర్ రీసెంట్ గా విడుదలై మంచి స్పందనను దక్కించుకుంది. ఇక ఇప్పుడు ఈ మూవీ నుంచి 'రావాలి రా' అనే పాటను శనివారం విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో.. దిల్ రాజు మాట్లాడుతూ.. 'ఐదుగురు సింగర్లతో పాటు వైష్ణవి చేత కీరవాణి గారు ఈ పాటను పాడించారు. నేను కూడా ఇంతలా హమ్ చేశానంటే.. అందరూ ఈ పాటను హమ్ చేస్తూనే ఉంటారు. కీరవాణి గారు ఎంతో మెలోడియస్‌గా ట్యూన్ చేశారు. ఈ స్టోరీ విన్నప్పుడు ఓ కొత్త కథ విన్న ఫీలింగ్ అనిపించింది. చాలా ఎగ్జైటింగ్‌తో ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నాను. అన్నీ కొత్త కథలు దొరకవు. కొన్ని సార్లు సేఫ్ గేమ్ ఆడుతుండాలి. ఇది చాలా కొత్త కథ అని మాత్రం నమ్ముతున్నాను. ప్రేక్షకులు ఎలాంటి రియాక్షన్ ఇస్తారో చూడాలి. సినిమా చూస్తున్నంత సేపు కూడా నెక్స్ట్ సీన్ ఏంటన్నది ఊహించలేరు. సినిమా అంతా అయ్యాకే ఆడియెన్స్‌కు అర్థం అవుతోంది. ఇది చాలా న్యూ అటెంప్ట్. ఇండస్ట్రీలో చాలా మంది హీరోలున్నారు. కొత్తగా ట్రై చేస్తేనే జనాలు యాక్సెప్ట్ చేశారని ఆశిష్‌కు సలహా ఇచ్చాను. ముందు నటుడిగా ఎదగమని సూచించాను. నా ఆలోచనను ఆశిష్ అర్థం చేసుకున్నారు. ఆశిష్ కోసం ఈ కథను అనుకోలేదు. నాగ, అరుణ్ కథ చెప్పాక.. ఆశిష్ అయితే ఎలా ఉంటుందో చూడండని చెప్పాను. ఓ వారం తరువాత వాళ్లే వచ్చి ఆశిష్ బాగుంటాడని అన్నారు. పీసీ శ్రీరామ్, కీరవాణి గారికి స్క్రిప్ట్ చెప్పి ఒప్పించారు. చాలా కొత్తగా ఉందని వారు అంగీకరించారు. బడ్జెట్ ఎంతో చెప్పండి.. ఆ బడ్జెట్లోనే తీస్తామని నాగ, అరుణ్ ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. ఇదో ఘోస్ట్ లవ్ స్టోరీ. సినిమాను ముందే కొంత మందికి చూపించాలని అనుకున్నాం. కానీ ట్విస్టులు రివీల్ అవుతాయని ముందుగా చూపించడం లేదు' అని అన్నారు.

## అ సినిమాలు చేస్తాను కానీ చూడను

తాను హారర్, హింసాత్మక సినిమాలు చూడను కానీ, నటిస్తానని అంటోంది ఆండ్రియా జెరోమియా. ఇప్పుడు ఆండ్రియా నటించిన హారర్ థ్రిల్లర్ విడుదలకు రావాల్సి ఉండగా ఊహించని ట్విస్టు ఎదురైంది. వివరాల్లోకి వెలితే.. నటి, గాయని కం డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆండ్రియా జెరెమియా నటించిన 'కా ది ఫారెస్ట్' అడ్వెంచర్ థ్రిల్లర్ విడుదలకు సిద్ధమవుతోంది. దీనికి నాంజిల్ దర్శకత్వం వహించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సినిమాలలో ఇది ఒకటి. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మార్చి 29న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే కోర్టు నిన్న సినిమా విడుదలను నిలుపుదల చేస్తూ వాయిదా వేసింది. ? 'కా ది ఫారెస్ట్' అనేది శలోమ్ స్టూడియోస్-శశికళ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. అయితే ఈ సినిమా విడుదలపై నిషేధం విధించాలంటూ ఎయిట్ ఎంటర్ టైన్ మెంట్ కంపెనీ యజమాని జయకుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో విడుదలకు సంబంధించి న్యాయపరమైన చిక్కుల్లో పడింది. చిత్ర నిర్మాత తీసుకున్న అప్పు విషయంలో స్టూడియోల మధ్య వివాదం జరిగినట్లు తెలుస్తోంది. షాలోమ్ స్టూడియోస్‌కు చెందిన జాన్ మాక్స్ ఎయిట్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీ నుంచి 20 లక్షల రుణం తీసుకున్నారని, 90 రోజుల్లో వడ్డీతో సహా తిరిగి ఇస్తానని హామీ ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పు చెల్లించకుండా సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించడంతో జయకుమార్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ సినిమా పూర్తి కాపీరైట్లను కూడా కోరుతున్నారు. ఈరోజు (మార్చి 29) సినిమా విడుదలపై మధ్యంతర నిషేధం విధిస్తూ మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ పిటిషన్‌పై స్పందించాలని నిర్మాతను ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 12కి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఏప్రిల్ 12వ తేదీన 'కా ది ఫారెస్ట్' విడుదల కానుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆండ్రియా జెర్మియా - సలీం గౌస్ ప్రధాన పాత్రలు పోషించారు. సుందర్ సి బాబు సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి అరివళగన్ సినిమాటోగ్రఫీ, ఎలిసా ఎడిటింగ్.



## దసరా ట్రయో ఈజ్ బ్యాక్ #Nani33 అనౌన్స్ మెంట్




పీరియడ్ లవ్, మాస్ యాక్షన్ డ్రామా 'దసరా' 2023లో బిగ్గెస్ట్ హిట్‌లలో ఒకటి. నేచురల్ స్టార్ నానితో సహా ఈ సినిమాలో భాగమైన దాదాపు ప్రతి ఒక్కరికీ అత్యధిక వసూళ్లు రాబట్టింది. దసరా త్రయం మరోసారి చేతులు కలిపారు. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ (SLV సినిమాస్) సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న కొత్త చిత్రం #Nani33 కోసం దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టారు. శ్రీకాంత్ ఓదెల దసరాతో ఆకట్టుకునే అరంగేట్రం చేసాడు. దసరా కమర్షియల్ హిట్‌గా సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు పొందింది. రచయితగా, దర్శకుడిగా తన సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు. మునుపెన్నడూ లేని మాస్ క్యారెక్టర్ లో నానిని ప్రెజెంట్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్ ఎరుపు రంగులో పెయింట్ చేయబడింది, ఇది వైలెన్స్ సూచిస్తుంది. నాని గడ్డం, మెలితిప్పిన మీసాలతో మ్యాసీవ్ అవతార్‌లో కనిపించారు. స్టైలిష్ షేడ్స్ ధరించి, గ్రేస్ ఫుల్ గా సిగార్‌ను కాలుస్తూ కనిపించారు. 'You don’t need an identity to be a leader'' అని పోస్టర్ పై రాసుంది. వాస్తవానికి, నాని ముఖం అతని పాత్రను సూచించే నేపథ్యంలో జనసమూహంతో డిజైన్ చేయబడింది. నానిని పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేయడానికి శ్రీకాంత్ మరో విన్నింగ్ స్క్రిప్ట్ రెడీ చేశాడు. ప్యాషనేట్ ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి ఈ కొత్త సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. అన్ని రకాల జోనర్స్, సబ్జెక్ట్‌లతో అలరిస్తున్న నాని.. శ్రీకాంత్ ఓదెలతో కలిసి మళ్లీ పనిచేయడానికి ఉత్సాహంగా వున్నారు.

## శర్మ&అంబాని మొదటి పోస్టర్ రిలీజ్




టాలీవుడ్‌లో ఈ మధ్య కామెడీ జానర్ సినిమాలు కాస్త తగ్గిపోయాయి. ఇప్పుడు ఆ లోటును పూర్తి చేసేలా ఓ మంచి కామెడీ ఎంటర్టైన్ ఏప్రిల్ 11న ETV WIN OTT వేదికపై విడుదల కానుంది. భరత్ తిప్పిరెడ్డి, ధన్య బాలకృష్ణ, కేశవ కర్రి ముఖ్య పాత్రలలో నటించిన సినిమా 'శర్మ & అంబాని'. ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు తెప్పించే క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కింది. కార్తిక్ సాయి దర్శకత్వంలో, నియా డిజిటల్ సొల్యూషన్స్ బ్యానర్ కింద, అనిల్ పల్లా మరియు భరత్ తిప్పిరెడ్డి నిర్మాణంలో 'శర్మ & అంబాని' రూపొందింది. ఈ చిత్రం నుండి విడుదల అయిన పోస్టర్స్ మరియు ఫస్ట్ సింగిల్‌కు ఆడియెన్స్ నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రచార చిత్రాలకు ప్రేక్షకులు 'శర్మ & అంబాని'కి మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ఇటీవల చిత్ర బృందం 'మనమే రాజా' అంటూ సాగే మొదటి పాటను ఆవిష్కరించారు. శశాంక్ ఆలమురు & మాహా ద్వారా ఈ పాటను వినసొంపుగా కంపోజ్ చేశారు. మంచి డ్యాన్స్ నంబర్‌గా స్వరపరిచబడిన ఈ ఆడియో ట్రాక్, ఆడియెన్స్‌ను తన్మయం చేసింది. కిట్టు విస్సాప్రగడ రాసిన సాహిత్యం.. ఈ పాట కంపోజిషన్‌కు మరో ఆకర్షణగా నిలిచింది. ఈ పాటను ప్రుధ్వి చంద్ర, ప్రతీక్ నాగ్ ఆలపించారు.



## 'భరతనాట్యం' కంటెంట్ చాలా ఇంట్రెస్టింగ్ గా వుంది

### హీరో ఆనంద్ దేవరకొండ

సూర్య తేజ ఏలే డెబ్యు మూవీ 'భరతనాట్యం'. దొరసాని ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ ని క్రియేట్ చేశాయి. వేసవి కానుకగా ఏప్రిల్ 5న విడుదలకు కానుంది. నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిధిగా హాజరైన ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో హీరోయిన్ శివాత్మిక, జీవిత రాజశేఖర్, నవదీప్, దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, విరించి వర్మ, నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, మధుర శ్రీధర్, లగడపాటి శ్రీధర్ అతిథులుగా పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ..'భరతనాట్యం' ప్రమోషనల్ కంటెంట్ చాలా ఇంట్రస్టింగ్ గా వుంది. క్రైమ్ కామెడీ నా ఫేవరేట్ జోనర్. చాలా ఆసక్తికరమైన కథ ఇది. చాలా మంది ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పని చేస్తున్నారు. వివేక్ సాగర్ చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. అలాగే ఎడిటర్ రవితేజ నా ఫేవరేట్ ఎడిటర్. నిర్మాతలు పై పాయల్ సరాఫ్, హితేష్ గారికి ఈ సినిమా మంచి విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. దొరసాని సినిమా మా అందరికీ చాలా మంచి పేరు తీసుకొచ్చింది. దర్శకుడు కెవిఆర్ మహేంద్ర, నేను, శివాత్మిక.. ఇలా దాదాపు అందరం కొత్తవాళ్లతో ఆ సినిమా చేశాం. ఆ సినిమా మా అందరి కెరీర్ లో ప్రత్యేకంగా నిలిచింది. ఇదే నమ్మకంతో చెబుతున్నా... 'భరతనాట్యం' సినిమా కూడా సూర్య తేజ తో పాటు సినిమా యూనిట్ అందరికీ చాలా మంచి పేరు తీసుకొస్తుంది. కెవిఆర్ మహేంద్ర ని మా అన్నలా భావిస్తాను. కెవిఆర్ మహేంద్ర అన్న విషయంలో ఎప్పుడూ గర్వంగా ఫీలౌతాను. 'భరతనాట్యం' కూడా చాలా పెద్ద విజయం సాధిస్తుంది. ధని ఏలే గారు పాతికేళ్ళు అద్భుతమైన వర్క్ చేస్తున్నారు. ఈ వేడుకకు విచ్చేసిన అతిధులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాలో పని చేసిన ప్రతి ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. ఏప్రిల్ 5న ..'భరతనాట్యం', ఫ్యామిలీ స్టార్ సినిమాలు వస్తున్నాయి. రెండు సినిమాలని చూసి ఎంజాయ్ చేయండి. అన్నీ సినిమాలు విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. మన ఇండస్ట్రీ బావుండాలి. మనమంతా బావుండాలి' అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.